




PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 155, పేజీలు - 08

శుక్రవారం, నవంబర్ 14, 2025 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD









# ప్రజాధనం పచ్చి లూటీ!

- 'బోగస్' స్వాతంత్ర యోధుడిని సృష్టించి వందల కోట్ల భూ కుంభకోణం..
- కంచెయే చేను మేసింది! మాజీ కలెక్టర్, ఆర్డీవో, తహసిల్దార్ల అండదండలతోనే బరితెగింపు.!
- కోర్టు ఆదేశాలతో ఎల్బీనగర్ పీఎస్‌లో పలు సెక్షన్ల కింద కేసు నమోదు.



డి. భాస్కర్ రెడ్డి

**ఆస్తులను కాపాడాల్సిన చేతులే.. అక్రమాలకు తెగబడితే.? ప్రజల సొమ్ముకు ధర్మకర్తలుగా ఉండాల్సిన ఉన్నతాధికారులే.. వ్యవస్థను కొల్లగొడితే.? హైదరాబాద్‌లో వెలుగు చూసిన ఈ భూ కుంభకోణం సరిగ్గా అలాంటిదే. ఇది మామూలు అక్రమం కాదు, అధికారుల అండతో జరిగిన ఓ వ్యవస్థీకృత నేరం. వందల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని కాజేయడానికి, ఏకంగా ఉనికిలో లేని ఒక 'బోగస్' స్వాతంత్ర సమరయోధుడిని సృష్టించారు. ఈ భారీ లూటీలో సామాన్యులు కాదు, సాక్షాత్తూ మాజీ జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తహసిల్దార్ స్థాయి అధికారుల ప్రమేయం ఉండటం 'కంచెయే చేను మేసిన' చందానికి నిలువెత్తు సాక్ష్యం. దొంగ పత్రాలు సృష్టించి, రికార్డులను తారుమారు చేసి, చివరికి కోర్టు జోక్యంతో పోలీసు కేసు వరకు వెళ్లిన ఈ పచ్చి బాగోతంపై సామాజిక కార్యకర్త బాబా గౌడ్ 'ప్రజా ప్రశ్న'కు అందిస్తున్న కథనం.**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రాచరిక వ్యవస్థ పోయినా, కొందరు అధికారుల రూపంలో 'దొరల' పాలన కొనసాగుతూనే ఉంది. ప్రజల ఆస్తులకు ధర్మకర్తలుగా, రక్షకులుగా ఉండాల్సిన కొందరు ఉన్నతాధికారులే భక్షకులుగా మారారు. వ్యవస్థలోని లొసుగులను ఆసరాగా చేసుకుని, ఏకంగా ఉనికిలో లేని ఒక వ్యక్తిని సృష్టించి, వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని అక్రమార్కులకు కట్టబెట్టేందుకు బరితెగించారని సామాజిక కార్యకర్త బాబా గౌడ ఆరోపించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, ఉప్పల్ మండలం, బండ్లగూడ పరిధిలోని సర్వే నెంబర్ 36/5 లో జరిగిన ఈ 10 ఎకరాల భూ కుంభకోణం, అధికారుల అవినీతి ఏ స్థాయిలో పాతుకుపోయిందో చెప్పడానికి నిలువెత్తు సాక్ష్యం. బాబా గౌడ్ ద్వారా 'ప్రజా ప్రశ్న' వెలుగులోకి తెచ్చిన ఈ బాగోతంపై, కోర్టు ఆదేశాల మేరకు ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది.

## కట్టుకథ అల్లి.. కలెక్టరేట్ నుంచే కుట్ర!

వివరాల్లోకి వెళితే, ఈ కుంభకోణం వెనుక ఉన్న సూత్రధారులు అత్యంత పకడ్బందీగా కుట్ర పన్నారు. సర్వే నెం. 36/5 లోని 10 ఎకరాల ప్రభుత్వ భూమిని కాజేయడానికి, వారు 'రాచకొండ కనకయ్య' అనే పేరుతో ఒక బోగస్ స్వాతంత్ర సమరయోధుడిని సృష్టించారు. అసలు ప్రభుత్వ రికార్డుల్లో ఇలాంటి వ్యక్తికి ఎలాంటి భూ కేటాయింపు జరగకపోయినా, జరిగినట్లుగా దొంగ పత్రాలు,
నకిలీ రికార్డులను పుట్టించారు. ఈ పాపంలో సామాన్యులు కాదు, ఏకంగా అన్ని కండువాలు మార్చి ప్రస్తుతం తన భూకబ్జాలను లీగలైజ్ చేసుకోవడానికి జాతీయ పార్టీ పేరు చెప్పుకొని చలామణి అవుతున్న డీ. భాస్కర్ రెడ్డి, అప్పటి జిల్లా కలెక్టర్ ఎం.వి. రెడ్డి, కీసర ఆర్డీవో లచ్చిరెడ్డి, ఉప్పల్ తహసిల్దార్ రమేష్ కుమార్ స్థాయి అధికారులే భాగస్వాములయ్యారనేది ప్రధాన ఆరోపణ. జీవో 1045 ప్రకారం, స్వాతంత్ర సమరయోధులకు కేటాయించిన భూమిని పదేళ్ల తర్వాత అమ్ముకోవచ్చనే నిబంధనను అడ్డం పెట్టుకుని, ఈ అధికారులు అక్రమార్కులకు సహకరించారు. దేశానికి సేవ చేసిన స్వాతంత్ర సమరయోధుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం గొప్ప ఉద్దేశంతో తెచ్చిన ఉత్తర్వులను, ఈ అక్రమార్కులు తమ స్వప్రయోజనాల కోసం దుర్వినియోగం చేశారని, అధికారుల అవినీతి బాగోతం వెలుగులోకి వచ్చినా, వారు అదే డిపార్ట్మెంట్‌లో కొనసాగడం అత్యంత శోచనీయం, ఇది ఖండనీయమని బాబా గౌడ్ పేర్కొన్నారు.



## అధికార దుర్వినియోగానికి పరాకాష్ట!

భూమిని కాపాడాల్సిన అధికారులే, ఈ 10 ఎకరాల ప్రభుత్వ భూమిని నిషేధిత జాబితా (ప్రొహిబిటెడ్ లిస్ట్) నుండి తొలగించాలంటూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు అధికారికంగా లేఖలు రాయడం ఈ కుంభకోణం తీవ్రతకు అద్దం పడుతోంది. అంతటితో ఆగకుండా, ఆ స్థలంలో నిర్మాణ అనుమతుల కోసం జీహెచ్ఎంసి అధికారులకు నిరభ్యంతర పత్రం కూడా జారీ చేశారంటే, వారు ఎంతగా బరితెగించారో అర్థం చేసుకోవచ్చు.

## 'ప్రజావాణి' ఫిర్యాదుతో కదిలిన డొంక

ఈ అక్రమాలపై ఓ పత్రికా ప్రతినిధి 'ప్రజావాణి'లో ఫిర్యాదు చేయడంతో ప్రస్తుత జిల్లా కలెక్టర్ స్పందించారు. సమగ్ర విచారణకు ఆదేశించారు. రికార్డులు తనిఖీ చేసిన ఉప్పల్ తహసిల్దార్ వాణి రెడ్డి, అసలు రాచకొండ కనకయ్య పేరుతో ఎలాంటి కేటాయింపు జరగలేదని, ఇదంతా బోగస్ అని తేల్చి నివేదిక ఇచ్చారు. ఎన్ని ఒత్తిడులు వచ్చినా, కీసర ఆర్డీవో సైతం లోతైన దర్యాప్తు చేసి, అసలు రాచకొండ కనకయ్య స్వాతంత్ర సమరయోధుడే అనడానికి ఆధారాలు లేవని, పహాణీ రికార్డుల్లో కావాలనే పేరు ఎక్కించారని నిగ్గు తేల్చారు.

## పోలీసుల నిర్లక్ష్యం.. కోర్టు 'మొట్టికాయ'

ఈ స్పష్టమైన ఆధారాలన్నింటిపై పోషం శంకర్ గౌడ్ అనే ఫిర్యాదుదారుడు 2022లో పోలీసులను ఆశ్రయించినా వారు పట్టించుకోలేదు. ఉన్నతాధికారుల ప్రమేయం ఉండటంతో కేసును పక్కన పడేశారు. దీంతో బాధితుడు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, విచారణ జరిపిన కోర్టు, ఈ కుంభకోణంపై తక్షణం సీఆర్‌పీసీ 156(3) కింద కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించింది. కోర్టు 'మొట్టికాయ' వేయడంతో, 12 నవంబర్ 2022న ఎల్బీనగర్ పోలీసులు ఎట్టకేలకు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

## కేసు కాదు.. ఇది వ్యవస్థీకృత నేరం!

ఈ ఎఫ్ఐఆర్‌లో పోలీసులు నమోదు చేసిన సెక్షన్లు చూస్తే, ఇది సాధారణ భూకబ్జా కాదని, ఇది అధికారుల అండతో జరిగిన వ్యవస్థీకృత నేరమని (ఆర్గనైజ్డ్ క్రైమ్) స్పష్టమవుతోంది.

- సెక్షన్ 409 (ప్రభుత్వ సేవకులచే విశ్వాసఘాతుకం): ప్రజల నమ్మకాన్ని, ప్రభుత్వ ఆస్తిని కాపాడాల్సిన కలెక్టర్, ఆర్డీవో, తహసిల్దార్ వంటి వారే దాన్ని కాజేయడానికి కుట్ర పన్నడం. ఇది అత్యంత తీవ్రమైన నేరం.
-సెక్షన్ 420 (మోసం): ఉనికిలో లేని వ్యక్తిని సృష్టించి ప్రభుత్వాన్నే మోసం చేయడం.
- సెక్షన్ 468 %ఀ% 471 (ఫోర్జరీ, నకిలీ పత్రాలను ఉపయోగించడం): దొంగ రికార్డులు సృష్టించి, వాటిని రిజిస్ట్రేషన్, జీహెచ్ఎంసి వంటి శాఖల్లో అసలైనవిగా నమ్మించి ఉపయోగించడం.
- సెక్షన్ 120(బి) (నేరపూరిత కుట్ర): ఈ మొత్తం నేరానికి అధికారులు, ప్రైవేట్ వ్యక్తులు (ఏ-1 వేజెండ్ల శివ ప్రసాద్) కలిసి పక్కా పథకం రచించడం.



ఎం. వి. రెడ్డి



లచ్చి రెడ్డి

ఈ కుంభకోణంలో ఏ-1 గా ఒకరిని పేర్కొన్నప్పటికీ, ఈ నేరానికి తెర వెనుక సూత్రధారులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న నాటి ఉన్నతాధికారులను చట్టం ఎప్పుడు పట్టుకుంటుందో చూడాలి.
కేవలం దర్యాప్తు పేరుతో కాలయాపన చేసి, అసలు 'పెద్ద తలలను' వదిలేస్తారా, లేక చట్టం ముందు నిలబెట్టి, అన్యాక్రాంతమైన ప్రజా ఆస్తిని కాపాడతారా అన్నది తేలాల్సి ఉంది. ఈ కేసు దర్యాప్తు పురోగతిపైనా, ప్రస్తుత పరిస్థితిపైనా, తెర వెనుక జరిగిన చీకటి ఒప్పందాలపైనా 'ప్రజా ప్రశ్న' మరో కథనం ద్వారా పూర్తి ఆధారాలతో ప్రజల ముందు ఉంచబోతోంది.

---

### ఢిల్లీ ఎర్రకోట కేసులో

# బిగ్ ట్విస్ట్

**32 పేలుళ్ల కుట్ర.. నిఘా వర్గాల షాకింగ్**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఢిల్లీ ఎర్రకోట వద్ద చోటు చేసుకున్న పేలుళ్ల కేసు తవ్వే కొద్దీ షాకింగ్ వాస్తవాలు బయటపడుతున్నాయి. ఇప్పటికే ఈ కేసును దర్యాప్తు చేయడం ప్రారంభించిన ఎన్ఐఏ బృందాలకు నిఘా వర్గాల నుంచి అందుతున్న విషయాలు విభ్రాంతి కలిగించేలా

2లో..

### చైనాకు ప్రత్యామ్నాయం

# తెలంగాణనే

**- ఢిల్లీ వేదికగా సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** భారత్‌లో పెట్టుబడులు పెట్టాలనుకునే ప్రపంచ పారిశ్రామికవేత్తలకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గట్టి భరోసా ఇచ్చారు. అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు, భద్రత, భౌగోళికంగా కేంద్ర స్థానంలో ఉన్న హైదరాబాద్ నగరం పెట్టుబడులకు అత్యుత్తమ గమ్యస్థానమని ఆయన స్పష్టం చేశారు. ఢిల్లీలో జరిగిన అమెరికా-భారత్ వ్యూహాత్మక భాగస్వామ్య సదస్సులో పాల్గొన్న సీఎం, 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌ను

2లో..




### హెల్త్ వార్నింగ్ ఇస్తున్న

# చలి

**- వందలో 15 మందికి ఆ జబ్బు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలుగు రాష్ట్రాలలో చలి బాగా పెరిగింది. చలికాలంలో వాతావరణ మార్పులు, కాలుష్యం తదితర కారణాలతో ప్రస్తుతం ఒక తీవ్ర సమస్య తెలుగు రాష్ట్రాలలో ప్రజలను

2లో..

### గ్రీన్ ఎనర్జీయే

# ప్రపంచానికి కీలకం

**- భారత్-ఈయూ బిజినెస్ రౌండ్ టేబుల్ సమావేశంలో చంద్రబాబు**
**- ఏపీని గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా తీర్చిదిద్దుతామని సీఎం ప్రకటన**
**- నౌకా నిర్మాణ రంగంలో పెట్టుబడులు పెట్టాలని విదేశీ సంస్థలకు పిలుపు**
**- ప్రకృతి విపత్తులకు భూతాపమే కారణమని ఆందోళన**




**విశాఖపట్నం (ప్రశ్న న్యూస్)** రాబోయే కాలంలో ఏయే రంగాలకు ప్రాధాన్యత ఉంటుందో గుర్తించి ఆయా రంగాల్లో అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పెట్టుబడులు పెట్టడానికి అనువైన ప్రాంతంగా ఉంటుందని వెల్లడించారు. విశాఖలో గురువారం ఇండియా-యూరప్ బిజినెస్

2లో..

# ఢిల్లీ ఎర్రకోట కేసులో బిగ్ ట్విస్ట్

ఉన్నాయి. వీటిలో ఢిల్లీ ఎర్రకోట వద్ద ఒక్క కారు పేల్చి విధ్వంసం సృష్టించాలన్నది తీవ్రవాదుల ఆలోచన కాదని తేలింది. ఢిల్లీతో పాటు వివిధ నగరాల్లో 32 కార్లను పేల్చేందుకు వారు కుట్ర పన్నినట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి.ఈ కేసును దర్యాప్తు చేస్తున్న అధికారులు తీవ్రవాదులు హ్యుండాయ్ ఐ20 కారుతో పాటు ఫోర్డ్ ఎకో స్పోర్ట్ కారు రూపురేఖలు మార్చి పేలుళ్లకు వాడేందుకు ప్లాన్ చేసినట్లు గుర్తించారు. ఈ రెండు కార్లను పేల్చిన తర్వాత మొత్తం 32 కార్లను వివిధ నగరాల్లో పేల్చడం ద్వారా భారీ విధ్వంసం చేయాలని నిర్ణయించుకున్నట్లు నిఘా వర్గాలు చెప్తున్నాయి. ఎనిమిది మంది అనుమానితులు పేలుడు సామాగ్రిని గ్రూపులుగా విడిపోయి ఆయా నగరాలకు తీసుకెళ్తున్నట్లు గుర్తించారు. వివిధ నగరాల్లో ఐఈడీలను అమర్చి ఈ పేలుళ్లు ఏకకాలంలో జరపాలని వీరు ప్లాన్ చేసినట్లు సమాచారం.ఈ ప్లాన్ చేసిన వారిలో ఇప్పటికే అరెస్టు చేసిన డాక్టర్లు ముజమ్మిల్, అదీల్, ఉమర్, షహీన్ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ భారీ ఆపరేషన్ కోసం 20 లక్షల రూపాయలు పోగు చేసి డాక్టర్ ఉమర్ కు వీరు అందించినట్లు గుర్తించారు. ఈ మొత్తంతో 20 క్వింటాళ్ల నైట్రోజన్, ఫాస్పరస్, పొటాషియం తో కూడిన ఎన్పీకే ఎరువు కొనుగోలు చేసేందుకు ప్లాన్ చేశారు. ఇందులో 3 లక్షలు గురుగ్రామ్ ప్రాంతం నుంచే సేకరించినట్లు గుర్తించారు. ఇందుకోసం ప్రధాన నిందితుడు ఉమర్ రహస్యంగా ఉండేలా ప్రైవేట్ సిగ్నల్ గ్రూప్ క్రియేట్ చేశాడు.ఇందులో మరో నలుగురిని సభ్యులుగా యాడ్ చేశాడు. అలాగే ముజమ్మిల్ గతంలో ఐసిస్ కు అనుబంధంగా ఉన్న అన్సర్ గజ్వతుల్ హింద్ అనే సంస్థకు 2021 నుంచి 2022 వరకూ పనిచేశాడు. అతను ఈ తీవ్రవాద సంస్థకు ఇర్ఫాన్ అనే మరో వ్యక్తి ద్వారా పరిచయం అయినట్లు తేలింది. వీరంతా స్వతంత్ర తీవ్రవాద సంస్థ ఏర్పాటు చేసేందుకు 2023-24 మధ్య చేసిన ప్రయత్నాల్లో ఆయుధాలు పోలీసులకు లభ్యమయ్యాయి. దీంతో వీరి నెట్ వర్క్ మొత్తాన్ని ఛేదించేందుకు పోలీసులు ఇప్పుడు ప్రయత్నిస్తున్నారు.ఢిల్లీ పేలుడు తర్వాత నిందితుడు ఉమర్ వాడిన ఫోర్డ్ ఎకో స్పోర్ట్ కారును పోలీసులు ఖండవాలీ గ్రామంలో స్వాధీనం చేసుకున్నారు. ఇతను పేలుళ్లలో చనిపోయాడు.

# చైనాకు ప్రత్యామ్నాయం తెలంగాణనే

ఆవిష్కరించి, రాష్ట్రంలోని అవకాశాలను వివరించారు. దేశంలోనే అత్యధిక యువత, వేగవంతమైన వృద్ధి రేటుతో తెలంగాణ దూసుకుపోతోందని రేవంత్ రెడ్డి తెలిపారు. గత 35 ఏళ్లుగా కాంగ్రెస్‌తో సహా ఏ పార్టీ అధికారంలో ఉన్నా, పెట్టుబడులకు, పెట్టుబడిదారులకు సంపూర్ణ మద్దతు ఇచ్చిందని, ఈ విషయంలో రాష్ట్రంలో రాజకీయ స్థిరత్వం ఉందని ఆయన గుర్తుచేశారు. అందుకే భారత్‌లో పెట్టుబడులకు హైదరాబాద్‌ను ముఖద్వారంగా చూడాలని ఆయన పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు.మహిళా సాధికారత, నాణ్యమైన విద్య, యువతకు నైపుణ్య శిక్షణ, అత్యున్నత జీవన ప్రమాణాలతో హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దడమే తన ప్రథమ ప్రాధాన్యత అని సీఎం వివరించారు. ప్రభుత్వం చేపడుతున్న పలు కీలక ప్రాజెక్టుల గురించి ఆయన ప్రస్తావించారు. 30 వేల ఎకరాల్లో నిర్మించతలపెట్టిన 'భారత్ ఫ్యూచర్ సిటీ' దేశంలోనే ఒక నూతన నగరంగా నిలుస్తుందన్నారు. మూసీ నది పునరుజ్జీవనం పూర్తయితే లండన్, దుబాయ్, టోక్యో నగరాల తరహాలో హైదరాబాద్‌లో నైట్ ఎకానమీ కొత్త రూపు సంతరించుకుంటుందని తెలిపారు. డ్రై పోర్ట్, మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్ వంటి ప్రాజెక్టులతో పాటు 'చైనా ప్లస్ వన్' మోడల్‌కు ప్రపంచవ్యాప్త సమాధానం తెలంగాణనే అవుతుందని సీఎం ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి కొన్ని ఆసక్తికరమైన ప్రతిపాదనలు చేశారు. హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్ వంటి ప్రఖ్యాత ఐవీ లీగ్ విశ్వవిద్యాలయాలు హైదరాబాద్‌లో తమ క్యాంపస్‌లు ఏర్పాటు చేస్తే, గ్లోబల్ సౌత్ దేశాల విద్యార్థులకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుందని అన్నారు. అదేవిధంగా, హైదరాబాద్‌లో రోడ్లకు నేతల పేర్లు పెట్టే సంప్రదాయాన్ని మార్చి, గూగుల్, మెటా, టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి గ్లోబల్ కంపెనీల పేర్లను పెడతామని ఆయన చేసిన ప్రకటన సదస్సులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగానికి, ఆయన ఆవిష్కరించిన విజన్‌కు అంతర్జాతీయ వ్యాపార వర్గాల నుంచి విశేష స్పందన లభించింది. టెక్ దిగ్గజం, సిస్కో మాజీ సీఈఓ జాన్ చాంబర్స్ మాట్లాడుతూ, "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజన్ చాలా సాహసోపేతంగా, స్పష్టంగా, సాధించగలిగేలా ఉంది. ఆయన చెప్పిన ప్రాజెక్టులు ఎంతో ప్రేరణ కలిగించాయి" అని ప్రశంసించారు. సీఎం ఆహ్వానం మేరకు డిసెంబర్ 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే 'తెలంగాణ రైజింగ్' గ్లోబల్ సమ్మిట్‌కు అత్యధిక సభ్యులతో హాజరవుతామని, తెలంగాణ విజన్‌ను దగ్గరగా చూసేందుకు ఆసక్తిగా ఉన్నామని అధ్యక్షుడు డా. ముఖేష్ ఆఘి తెలిపారు.

# హెల్త్ వార్నింగ్ ఇస్తున్న చలి

భయపెడుతోంది. వైరస్, బ్యాక్టీరియాతో ఊపిరితిత్తుల సమస్యలు తీవ్రతరం అవుతున్నాయి. ప్రస్తుతం దగ్గు వస్తే చాలాకాలం పాటు తగ్గని పరిస్థితి నెలకొంది. ఇక చిన్నారులను, వృద్ధులను చలి కారణంగా వస్తున్న న్యుమోనియా పట్టిపీడిస్తోంది.

### ఎక్కడ చూసినా పెరుగుతున్న న్యుమోనియా కేసులు

రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడ చూసినా దగ్గు కేసులు పెరుగుతున్నాయి. దగ్గు సిరప్ తాగినా, ఎన్ని మందులు వేసుకున్న తగ్గని పరిస్థితులలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు చాలామంది న్యుమోనియా తో బాధపడుతున్నారని చెబుతున్నారు. ముఖ్యంగా ఈ శీతాకాలంలో శ్వాసకోశ సంబంధిత వ్యాధులు రెట్టింపు అవుతాయని, రెండేళ్లలోపు పిల్లలు, తక్కువ బరువుతో పుట్టిన వారు, పోషకాహార లోపం ఉన్నవారు ఈ సమస్యకు ఎక్కువగా గురవుతారని చెబుతున్నారు.

### చలి దెబ్బ.. వృద్ధులకు న్యుమోనియా

చలి కారణంగా ఊపిరితిత్తులు బిగుసుకుపోయి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు పడతారని చెబుతున్నారు. చలి నుండి రక్షణ కల్పించడం, వెచ్చని దుస్తులు, మాస్కులు ధరించడం ద్వారా కొంతమేర ఈ సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చని సూచిస్తున్నారు. ఇక వృద్ధులు కూడా వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండే కారణంతో న్యుమోనియా బాధితులుగా మారుతున్నారని చెబుతున్నారు.

### ఈ సమస్యలు ఉంటే న్యుమోనియా తీవ్రతరం

ధూమపానం, మద్యపానం వంటి అలవాట్లు ఉన్నవారు కూడా న్యుమోనియా బారిన పడుతున్నారని వైద్యులు పేర్కొంటున్నారు. బీపీ, మధుమేహం, కిడ్నీ సమస్యలు, ఊపిరితిత్తుల సమస్యలు ఉన్నవారికి ఈ సీజన్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని, సకాలంలో చికిత్స చేయకపోతే దారుణ పరిస్థితిని ఎదుర్కొంటారని చెబుతున్నారు.న్యుమోనియా వైరల్, ఫంగల్, బ్యాక్టీరియల్ ఇలా మూడు రకాలుగా ఊపిరితిత్తులపైన దాడి చేస్తుందని చెబుతున్నారు.

### వైద్యులతో చికిత్స ఉత్తమం

తీవ్రంగా జ్వరం రావడం, దగ్గు, జలుబు, గొంతు నొప్పి, ఒళ్ళు నొప్పులు వంటి ప్రధాన లక్షణాలతో ఇది వస్తుందని, వైద్యులను సంప్రదించి సరైన చికిత్స చేయించుకుంటేనే దీని నుండి బయట పడతామని చెబుతున్నారు. శీతాకాలంలో తగిన జాగ్రత్తలు పాటించకపోతే, చలి నుండి కాపాడుకోకపోతే పరిస్థితి తీవ్రతరం అవుతుందని హెచ్చరిస్తున్నారు.

# చెత్తంతా చెరువుల్లోకి..

కోదాడ, : సాగు, తాగు అవసరాలకు ఉపయోగపడే చెరువులు వ్యర్థాలతో చెత్తకుండీలుగా మారాయి. ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా 3,500 వరకు పెద్ద చెరువులున్నాయి. 60 శాతం మేర సమీప పరిశ్రమల నుంచి వ్యర్థాలతో కలుషితమవుతున్నాయని జల సంరక్షణ నివేదికల సర్వేలు వెల్లడిస్తున్నాయి. చెరువుల్లో కలుషితాల వ్యాప్తికి కారణమవుతున్న వారిపై కఠిన చర్యలు చేపడితేనే వ్యర్థాలతో కలిగే అనర్థాలు నియంత్రణలోకి వస్తాయని నీటి సంరక్షకులు అభిప్రాయ పడుతున్నారు.

# ఆయుధాల మాట..వాయిదానే..!

తుంగతుర్తి, : చందంపేట మండలం గువ్వలగుట్టలో అటవీ భూములను కొందరు గ్రామస్థులు దున్నుతుండడంతో అధికారులు అడ్డుకొని దస్త్రాలు చూపించాలన్నారు. దీంతో ఇరువురు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఘటనలో కొందరు గ్రామస్థులు రాళ్లు, కర్రలతో దాడులు చేయడంతో ఉద్యోగులు గాయపడ్డారు. ఈ పరిస్థితి ఇక్కడే కాదు ఆదిలాబాద్, భద్రాచలం తదితర అటవీ ప్రాంతాల్లో అధికారులపై దాడులు జరుగుతూ.. గాయాలపాలవుతున్నారు.

# ఆకలేస్తోంది..అల్పాహారం కావాలి..!

హుజూర్‌నగర్,: పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకు విద్యాశాఖ దృష్టి సారించింది. సాధారణ తరగతుల బోధనకు తోడు సాయంత్రం పూట పది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం పాఠశాలకు వచ్చే విద్యార్థులు సాయంత్రం వరకు తరగతి గదుల్లో చదువుని.. ఆ వెంటనే సాయంత్రం వేళ ప్రత్యేక తరగతులకు హాజరయ్యే క్రమంలో అలసటకు గురవడం సహజం. ఈ క్రమంలో ప్రత్యేక తరగతులపై పూర్తిగా శ్రద్ధ చూపలేని పరిస్థితి. దీనిని గుర్తించి ప్రభుత్వం అల్పాహారం అందజేస్తే విద్యార్థులకు మేలు జరగనుంది.

# 42 టేబుల్స్, 10 రౌండ్లు

## – ఉపఎన్నిక ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితాల వెల్లడికి ఎన్నికల అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభంకానుంది. ఓట్ల లెక్కింపు కోసం మొత్తం 42 టేబుల్స్‌ను ఏర్పాటు చేశారు. పది రౌండ్లలో కౌంటింగ్ ప్రక్రియ పూర్తికానుంది. ఉదయం 8 గంటలకు మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కిస్తారు.

### ఓట్ల లెక్కింపు కోసం ప్రత్యేక ఏర్పాట్లు

ఈసారి జూబ్లీహిల్స్ ఎన్నికల్లో మొత్తం 58 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఈ నెల 11న జరిగిన ఎన్నికల్లో 407 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఓటు వేశారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో 186 మంది సిబ్బంది పాల్గొంటారు. వీళ్లతోపాటు పోలింగ్ జరిగే ప్రాంతం చుట్టూ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. దాదాపు 250 మంది సిబ్బందిని నియమించినట్టు జూబ్లీహిల్స్ ఆర్వో కర్ణన్ తెలిపారు. లెక్కింపు కేంద్రం చుట్టూ 144 సెక్షన్ అమలులో ఉందని వెల్లడించారు. కేవలం అనుమతి ఉన్న వారికే లోపలికి వెళ్లనిస్తామని పోలీసులు స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎప్పటికప్పుడు ప్రజలకు సమాచారం చేరవేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు ఆర్వో కర్ణన్ పేర్కొన్నారు. ఎలాంటి ఆలస్యం లేకుండా ఫలితాలను నిరంతరం ఎన్నికల వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తామన్నారు అధికారులు. మీడియా కోసం ప్రత్యేకంగా ఎల్‌ఈడీ స్క్రీన్‌లు సిద్ధం చేశారు. ఒక్కో రౌండ్ లెక్కించడానికి 45 నిమిషాలు టైం పడుతుందని ఈ మేరకు అధికారులకు ఇప్పటికే శిక్షణ పూర్తి చేశామని వెల్లడించారు. సిబ్బంది, అభ్యర్థులు, వారి తరపున వచ్చే ఏజెంట్లు ఉదయం ఐదు గంటలకు చేరుకోవాలన్నారు. ఉదయం 8 గంటలకు



ప్రారంభమయ్యే ఓట్ల లెక్కింపు మధ్యాహ్నం 3 గంటలకు పూర్తి కానుంది.

### సర్వేలు కాంగ్రెస్‌కు అనుకూలం

సర్వేలు మొదట బీఆర్ఎస్ గెలుస్తుందని చెప్పాయి. ఎగ్జిట్ పోల్స్ మాత్రం అన్ని కాంగ్రెస్‌కు అనుకూలంగా ఫలితాలు ఉంటాయని చెప్పాయి. అయినా సరే కచ్చితంగా ప్రజలకు తమవైపే ఉంటారని బూత్‌ల వారీగా పోలైన ఓట్లు తమ ప్రచార పంథాను పార్టీలు విశ్లేషించుకుంటున్నాయి. ఈ ఉపఎన్నికల్లో విజయం సాధించి ఇదే ఊపుతో జీహెచ్‌ఎంసీ, లోకల్ ఎన్నికలకు వెళ్లాలని అన్ని పార్టీలు ప్లాన్ చేస్తున్నాయి.

# మీ కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం అద్భుతం

- చంద్రబాబుపై జగన్ సెటైర్లు - ముఖ్యమంత్రి చంద్రబాబుపై జగన్ తీవ్ర విమర్శలు
- 'క్రెడిట్ చోరీ స్కీం' అద్భుతంగా నడుస్తోందంటూ ఎద్దేవా
- వైసీపీ హయాంలో కట్టిన ఇళ్ల క్రెడిట్ కొట్టేస్తున్నారని విమర్శ



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్‌లో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య 'క్రెడిట్' వార్ తీవ్రస్థాయికి చేరింది. రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఇరు పక్షాలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబుపై వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు విజయవంతంగా "క్రెడిట్ చోరీ స్కీం" నడుపుతున్నారంటూ సోషల్ మీడియా వేదికగా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పేదల ఇళ్ల నిర్మాణం విషయంలో ప్రభుత్వం వాస్తవాలను పక్కనపెట్టి, తమ ఘనతగా ప్రచారం చేసుకుంటోందని జగన్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ లో ఓ సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. "చంద్రబాబు గారూ మీ కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో విజయవంతంగా నడుస్తున్న 'క్రెడిట్ చోరీ స్కీం' చాలా బాగుంది. ఇతరుల కష్టాన్ని తన గొప్పతనంగా చెప్పుకునేవాడు నాయకుడు కాదు. నాటకాల రాయుడు అంటారు" అంటూ తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు.వైసీపీ ప్రభుత్వ హయాంలో మంజూరు చేసి, నిర్మాణం ప్రారంభించిన ఇళ్లనే ఇప్పుడు తామే కట్టేశామంటూ కూటమి ప్రభుత్వం ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని జగన్ విమర్శించారు. "గత 18 నెలల్లో పేదలకు ఒక్క గజం స్థలం సేకరించలేదు, ఒక్క సెంటు స్థలం ఇవ్వలేదు, ఒక్క రూపాయి ఖర్చు చేయలేదు. గత ప్రభుత్వంలో ఇచ్చిన స్థలాల్లో, మేం శాంక్షన్ చేయించిన ఇళ్లనే పట్టుకుని 'అన్నీ మేమే కట్టేశాం' అని పచ్చి అబద్ధాలు చెప్తున్నారు. ఈ క్రెడిట్ చోరీ హేయంగా ఉంది" అని జగన్ తన పోస్టులో పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రారంభించామని చెబుతున్న 3,00,092 ఇళ్లలో ఒక్క ఇంటి పట్టా కూడా ప్రస్తుత ప్రభుత్వం ఇవ్వలేదని జగన్ స్పష్టం చేశారు. "ఆ ఇళ్లలో 1,40,010 ఇళ్లు మా హయాంలోనే పూర్తయ్యే దశలో ఉన్నాయి. మరో 87,380 ఇళ్లు స్లాబ్ లెవల్ వరకు, 66,845 ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నవి కూడా మా హయాంలో మొదలైనవే. ఇవి కాకుండా అక్టోబర్ 12, 2023న ఒకేరోజు 7,43,396 ఇళ్ల గృహప్రవేశాలతో మా ప్రభుత్వం చరిత్ర సృష్టించింది" అని జగన్ గుర్తుచేశారు.తమ హయాంలో 31.19 లక్షల ఇళ్ల పట్టాలిచ్చి, 21.75 లక్షల ఇళ్లు శాంక్షన్ చేశామని జగన్ తెలిపారు. మిగిలిన 10 లక్షల ఇళ్ల స్థలాల్లో నిర్మాణాలు చేపట్టాల్సింది పోయి, ఆ ఖాళీ స్థలాలను లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. "ఒకరి కష్టాన్ని, ఒకరి ఐడియాను మీదిగా చెప్పుకోవడంలో, చివరికి పేదల ఇళ్ల స్థలాలను లాక్కోవడంలో మీకు మీరే సాటి" అంటూ విమర్శించారు. తన పోస్టుకు క్రెడిట్ చోర్ బాబు అనే హ్యాష్‌ట్యాగ్‌ను జోడించి చంద్రబాబుపై తన పోరాటాన్ని సోషల్ మీడియాలో ఉద్ధృతం చేశారు.

# గ్రీన్ ఎనర్జియే ప్రపంచానికి కీలకం

పార్టనర్షిప్ రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సుస్థిరాభివృద్ధిలో భారత్-యూరప్ దేశాల మధ్య సహకార భాగస్వామ్యంపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి ఆర్మేనియా ఆర్థిక వ్యవహారాల మంత్రి గివార్గ్ పాపాయాన్, నెదర్లాండ్స్, ఫ్రాన్స్, జర్మనీ, అర్మేనియా తదితర దేశాలకు చెందిన ప్రతినిధులు, భారత్ ఫోర్జ్ వైస్ ఛైర్మన్ అమిత్ కళ్యాణి సహా వివిధ కంపెనీలకు చెందిన ఛైర్మన్లు, సీఈఓలు, సీఐఐ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంతోపాటు ఇంటరాక్షన్ సదస్సులో పాల్గొన్న ముఖ్యమంత్రి వివిధ అంశాలను ప్రస్తావించారు.

### గతంలో ఐటీని ఆంధ్రప్రదేశ్‌లో ప్రోత్సహించాం

'విశాఖ అద్భుతమైన సాగర తీర నగరం, మంచి వనరులు ఈ ప్రాంతంలో ఉన్నాయి. అమెరికా వెలుపల గూగుల్ అతిపెద్ద ఏఐ డేటా సెంటర్‌ను విశాఖలోనే ఏర్పాటు చేస్తోంది. సబ్ సీ కేబుల్ కూడా ఈ ప్రాంతం నుంచే ఏర్పాటు అవుతోంది'అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.'గతంలో ఐటీని ఆంధ్రప్రదేశ్‌లో ప్రోత్సహించాం. గూగుల్, ఆడోబ్, మైక్రోసాఫ్ట్ వంటి పెద్ద సంస్థల సీఈఓలుగా భారతీయులే ఉన్నారు. ప్రపంచ వ్యాప్తంగా వచ్చిన ఆర్థిక సంస్కరణల తర్వాత పరిస్థితులు అన్నీ మారిపోయాయి. జీవన ప్రమాణాలు గణనీయంగా పెరిగాయి. వాటికి అనుగుణంగా సంపద పెరగాల్సి ఉంది. దీని కోసం ఆంధ్రప్రదేశ్‌లో వివిధ రకాల పరిశ్రమల్ని ప్రోత్సహిస్తున్నాం. కేంద్రం ప్రారంభించిన భారత్ క్వాంటం మిషన్ నుంచి అవకాశాలను అందిపుచ్చుకున్నాం. దేశంలో తొలి క్వాంటం వ్యాలీని ఏపీ రాజధాని అమరావతిలో ఏర్పాటు చేస్తున్నాం. అలాగే డ్రోన్ల వినియోగం వివిధ రంగాల్లో పని చేసే వారికి అలాగే డిఫెన్సు రంగంలో ఉన్న వారికి ఉపయోగపడాలి. వీటి తయారీ పెరగాలి. అందుకే ఏపీని డ్రోన్ తయారీకి కేంద్రంగా చేయాలని భావిస్తున్నాం. కర్నూలు జిల్లాలో డ్రోన్ సిటీ ఏర్పాటు చేస్తున్నాం. స్పేస్ అప్లికేషన్లు కూడా రోజురోజుకీ పెరుగుతున్నాయి. ఏపీలో స్పేస్ సిటీని ఏర్పాటు చేస్తున్నాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వివరించారు.

### పోర్టులే మా బలం

'ఇప్పుడు గ్రీన్ ఎనర్జీ ప్రాధాన్యం కూడా పెరిగింది. సౌర, పవన, పంప్డ్ ఎనర్జీ రంగాల్లో ఏపీ బలంగా ఉంది. గ్రీన్ ఎనర్జీ రంగంలో భారత్ 500 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. అందులో 160 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాలని ప్రయత్నిస్తున్నాం'అని సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడించారు.'ప్రపంచవ్యాప్తంగా భూతాపం వల్ల ప్రకృతి విపత్తులు విధ్వంసం సృష్టిస్తున్నాయి. క్లౌడ్ బరస్ట్ లాంటి ప్రకృతి విపత్తులతో నగరాలు నీట మునిగే పరిస్థితి ఉత్పన్నం అవుతోంది. 40 సెంటిమీటర్ల వర్షపాతం ఒకే చోట పడుతోంది. గ్లోబల్ వార్మింగ్ వల్లే ఈ ఉత్పాతాలు సంభవిస్తున్నాయి. అందుకే మనం అంతా కలిసి గ్రీన్ ఎనర్జీ వైపు ముందడుగు వేయాలి. ప్రస్తుతం సౌర, పవన, పంప్డ్ ఎనర్జీ రంగాల్లో ఆంధ్రప్రదేశ్ పనిచేస్తోంది. త్వరలోనే ఆంధ్రప్రదేశ్ గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా తయారవుతుంది. ఏపీకి వస్తున్న డేటా సెంటర్లకు కూడా గ్రీన్ ఎనర్జీని సరఫరా చేస్తాం. మనం అంతా కలిసి మానవాళి సంక్షేమానికి పనిచేద్దాం. అలాగే పోర్టు రవాణా రంగంలో ఏపీలో అవకాశాలు ఉన్నాయి. పెద్ద ఎత్తున పోర్టులను నిర్మిస్తున్నాం. పోర్టులను వివిధ నెట్వర్క్ లకు అనుసంధానిస్తున్నాం. రైల్వే, ఎయిర్ పోర్టులతో పాటు దేశాల్లోని వివిధ ప్రధాన నగరాలకు ఏపీలోని పోర్టులతో అనుసంధానించేలా ప్రణాళిక రూపొందిస్తున్నాం. ప్రస్తుతం భారత్ దేశం నౌకా నిర్మాణంలో మరింత పురోగతి సాధించాల్సిన అవసరం ఉంది. ఈ రంగంలో పెద్దఎత్తున పెట్టుబడులు ఆహ్వానిస్తున్నాం. నౌకా నిర్మాణ రంగంలో అపారమైన అవకాశాలను వినియోగించుకోవాలి కోరుతున్నాం'అని సీఎం చంద్రబాబు నాయుడు చెప్పారు.

### ఎస్కార్ట్ ఆఫీసర్లను పెడతాం

'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అనే విధానాన్ని అమలు చేసి యుద్ధ ప్రాతిపదికన అనుమతులు ఇస్తున్నాం. కేవలం 45 రోజుల్లోనే అనుమతులు మంజూరు చేసి త్వరితగతిన ఉత్పత్తి చేసేలా ప్రోత్సహిస్తున్నాం.

గూగుల్ కూడా రెండు మూడు రోజుల్లో శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించబోతోంది. వారికి కూడా చాలా కొద్ది రోజుల్లోనే అనుమతులిచ్చాం. ప్రోత్సాహకాలు, వేగంగా అనుమతులు ఇవ్వటంలో ఏపీకి పోటీ లేదు. పెట్టుబడులతో ముందుకు వస్తే చాలు ఎస్కార్ట్ ఆఫీసర్‌ను నియమించి పరిశ్రమలు ఏర్పాటు చేసేలా సహకరిస్తాం. ప్రపంచ మార్కెట్‌లో ప్రవేశించడానికి ఆంధ్రప్రదేశ్ గేట్ వే గా ఉంటుంది. పారిశ్రామిక ఉత్పత్తులు, విద్య, వైద్యం, టూరిజం, ఫుడ్ ప్రాసెసింగ్ తదితర రంగాల్లో పెట్టుబడులకు అవకాశం ఉంది. ప్రస్తుతం ఆర్గానిక్ ఆహార ఉత్పత్తుల రంగంలోనూ కీలకంగా పని చేస్తున్నాం. ప్రకృతి సేద్యంలో పండించిన అరకు కాఫీ ఇప్పుడు గ్లోబల్ బ్రాండ్ గా మారింది. ఏపీలో ఉన్న అవకాశాలను పరిశీలించి ఆయా రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని యూరోప్ దేశాల్లోని పారిశ్రామిక వేత్తలను కోరుతున్నాను. 2047 నాటికి భారత్ ప్రపంచంలోనే అగ్రస్థాయి దేశంగా మారుతుంది, అందులో ఏపీ ముందుంటుంది'అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు.

# నాగార్జున కొండా సురేఖ మధ్య రాజీ

- మంత్రి కొండా సురేఖకు భారీ ఊరట
- కేసు విత్ డ్రా చేసుకున్న అక్కినేని నాగార్జున

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** టాలీవుడ్ ప్రముఖ నటుడు అక్కినేని నాగార్జున, తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మధ్య నెలకొన్న పరువు నష్టం దావా వివాదం సయోధ్యతో ముగిసింది. తాను గతంలో నాగార్జున కుటుంబంపై చేసిన వ్యాఖ్యలపై మంత్రి కొండా సురేఖ బహిరంగంగా క్షమాపణలు చెప్పడం, ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవడంతో తాజాగా నాగార్జున ఈ కేసును విత్‌డ్రా చేసుకున్నారు. గతంలో కొండా సురేఖ ఒక సందర్భంలో అక్కినేని కుటుంబానికి చెందిన నాగచైతన్య, సమంతల విడాకులకు సంబంధించి రాజకీయ కోణంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలు అక్కినేని కుటుంబ గౌరవానికి భంగం కలిగించాయని భావించిన నటుడు నాగార్జున, ఆమెపై నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో పరువు నష్టం దావా దాఖలు చేశారు. ఈ వివాదాస్పద కథనాలను ప్రచురించిన పలు యూట్యూబ్ ఛానెళ్లు, వెబ్‌సైట్‌లు, వ్యక్తులపైనా నాగార్జున న్యాయపరమైన చర్యలు తీసుకున్నారు.ఈ కేసు విచారణకు రానున్న నేపథ్యంలో మంత్రి కొండా సురేఖ మంగళవారం అర్ధరాత్రి తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతా వేదికగా ఒక సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు. 'నాగార్జున గారి గురించి నేను చేసిన వ్యాఖ్యలు ఎవరినైనా బాధించి ఉంటే, దానికి నేను చింతిస్తున్నాను. నాగార్జున గారిని లేదా వారి కుటుంబ సభ్యులను కించపరచాలనే ఉద్దేశం నాకు లేదు. నా ప్రకటనల వల్ల ఏదైనా అపార్థం కలిగితే దానికి నేను చింతిస్తున్నాను. వాటిని ఉపసంహరించుకుంటున్నాను' అని ఆమె ఆ ట్వీట్‌లో స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు ఉద్దేశపూర్వకంగా చేయలేదని కేవలం రాజకీయ విమర్శల సందర్భంలో వచ్చాయని ఆమె వివరణ ఇచ్చారు. మంత్రి కొండా సురేఖ పశ్చాత్తాపం వ్యక్తం చేస్తూ బహిరంగంగా క్షమాపణలు చెప్పడంతో నాగార్జున ఈ వివాదాన్ని ఇక కొనసాగించకూడదని నిర్ణయించుకున్నారు. ఈ దావా విచారణ సమయంలో కొండా సురేఖ తరపు న్యాయవాది క్షమాపణల విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్లడంతో పాటు



నాగార్జున తన కేసును విత్‌డ్రా చేసుకుంటున్నట్లు ప్రకటించారు. దీంతో దాదాపు ఏడాది కాలంగా నలుగుతున్న ఈ పరువు నష్టం దావా ఎపిసోడ్ సుఖాంతమైంది. న్యాయస్థానం గతంలోనే ఇలాంటి అంశాలపై అక్కినేని కుటుంబానికి వ్యతిరేకంగా మాట్లాడకుండా రాజకీయ నాయకులకు, ఇతరులకు మధ్యంతర ఉత్తర్వులు కూడా జారీ చేయడం గమనార్హం.

# వేములవాడలో సీపీఐ పార్టీ 100 ఏళ్ల ముగింపు సభ కరపత్రం ఆవిష్కరణ



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ మున్సిపల్ కార్యాలయం వద్ద గురువారం సీపీఐ పార్టీ స్థాపనకు 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జరుగనున్న ముగింపు సభకు సంబంధించి కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వేములవాడ నియోజకవర్గం ఇంచార్జి కడారి రాములు,సీపీఐ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద సుదర్శన్ ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ నెల 16, 17 తేదీలలో వేములవాడకు రానున్న సీపీఐ పార్టీ బస్సు జాతాలో పార్టీ నాయకులు,కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గత 100 సంవత్సరాల సుదీర్ఘ పోరాటంలో వేలాది ఎకరాల భూములను పేదలకు పంచిన ఘనత సీపీఐ పార్టీదేనని, పేదల హక్కుల కోసం నిరంతరం పాటుపడుతున్న పార్టీ ఇదేనని అన్నారు. డిసెంబర్ 26న ఖమ్మం జిల్లాలో జరగనున్న భారీ బహిరంగ సభ కూడా చారిత్రాత్మకంగా నిలవాల్సిన అవసరం ఉన్నదని నాయకులు తెలిపారు. ఈ ర్యాలీ,సభలో ముఖ్య అతిధులుగా కొత్తగూడెం ఎమ్మెల్యే కామ్రేడ్ కూనంనేని, మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ చాడా పాల్గొంటారని వెల్లడించారు. ముగింపు సభకు 40 దేశాల ప్రతినిధులు హాజరుకానుండటం ప్రత్యేక ఆకర్షణగా ఉంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి ఎల్ల దేవరాజు,సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు కెవి అనసూర్య, వేములవాడ రూరల్ మండల కార్యదర్శి శ్రీరాముల నర్సయ్య, పెంట మల్లయ్య, వావిలాల నర్సయ్య, గూడెం కనకయ్య, మహేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# బిసిల జీవితాలతో ఆడుకోవద్దు

**42 శాతం బిసి రిజర్వేషన్లు పార్టీల పరంగా కాకుండా చట్ట పరంగానే ఇవ్వాలి**

**తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలి**

**- బిసి విద్యార్థి జేఏసీ చైర్మన్ స్వామి గౌడ్**




ఓయూ(ప్రశ్న న్యూస్) ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలో విలేకరులు ఏర్పాటు చేసిన సమావేశంలో బిసి విద్యార్థి జేఏసీ చైర్మన్ బొల్లేపల్లి స్వామి గౌడ్ మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం తొందరపడి స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించొద్దు బిసిల జీవితాలతో ఆడుకోవద్దు 42 శాతం బిసి రిజర్వేషన్లను పార్టీల పరంగా కాకుండా చట్ట పరంగానే ఇచ్చి స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని బిసి విద్యార్థి జేఏసీ చైర్మన్ బొల్లెపల్లి స్వామి గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కామారెడ్డి బిసి డిక్లరేషన్ ఇచ్చిన హామీలలో ఒక ముఖ్యమైన హామీ విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికలలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తామని చెప్పడం ద్వారా కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారం చెప్పట్టిన విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం మారువొద్దాన్ని స్వామి గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ వచ్చేసారి అధికారంలోకి రావాలంటే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని పార్టీలతో కూడిన అఖిలపక్షాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దగ్గరికి తీసుకెళ్లాలి, ఒకవేళ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అపాయింట్ మెంట్ ఇవ్వని యెడల పార్లమెంట్లో లోక్ సభ ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పార్లమెంటులో ప్రైవేటు బిసి బిల్లును ప్రవేశపెట్టాలి. అప్పుడు ఈ శీతకాల సమావేశాలలో విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థలలో 42 శాతం బిసి రిజర్వేషన్లకు ఎవరు వ్యతిరేకులో, ఎవరు అనుకూలమో సాక్షాత్తు పార్లమెంట్ లోనే తెలుస్తుందని తొందరపడి రాష్ట్ర ప్రభుత్వం తప్పటడుగు వెయ్యొద్దని, అప్పుడు బిసి వ్యతిరేకుల భరతం బిసిలే పడుతారని రాష్ట్ర ప్రభుత్వానికి స్వామి గౌడ్ సూచించారు. ఈ కార్యక్రమంలో కౌశిక్, నిఖిల్, లింగాల మహేష్, శ్రీకాంత్, రవీందర్, శ్రీను, అరవింద్, నరేష్, రాజేష్,మహేందర్, పవన్, సందీప్, రాంబాబు మరియు తదితరులు పాల్గొన్నారు.

# హెచ్ఆర్సీ కి గైహాజరైన అధికారులు

**అక్రిడేషన్ల అవకతవకలపై హెచ్ఆర్సీ, జిల్లా అధికారి, డి పి ఆర్ ఓ. అధికారులకు సమాన్లు జారీ**

**హెచ్ఆర్సీకి వివరణ ఇచ్చేదెవరు.?**

నిజామాబాదు (ప్రశ్న న్యూస్) జిల్లా కలెక్టర్ ఇటీవలే బాధ్యతలు చేపట్టారు. సి సి, డి పి ఆర్ ఓ జిల్లా కలెక్టర్లను ను తప్పు దోవ పట్టించారు. జిల్లా మీడియా కమిటీ చైర్మన్ సమాచార పౌర సంబంధాల శాఖ జిల్లా అధికారులు, ఉన్నతాధికారుల నుండి నియమ నిబంధన ప్రకారం ప్రతి మూడు నెలలకు ఒకసారి కమిటీ సమావేశం నిర్వహించి, జర్నలిస్టులు అక్రిడిటేషన్ కార్డులు పొందిన వారిలో, వారు వారి పత్రికలలో పనిచేస్తున్నారా.? లేదా ఆ పత్రికల నుండి వెళ్లి ఇతర పత్రిక లో పనిచేస్తున్నారా అనే విషయాలను ఆయా సంస్థల నుండి గుర్తించి, లేదా సమాచారం తీసుకుని, పత్రికలలో పని చేయని వారిని, పత్రిక నుండి వెళ్లిపోయిన వారిని గుర్తించి, వారి అక్రిడేషన్లను రద్దు చేయాల్సి ఉంటుంది. వివిధ కేసుల్లో నిందితులుగా ఉన్న వారిని, మీడియాలో పని చేయని సంస్థలను గుర్తించి, ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం ఆ యొక్క వ్యక్తుల అక్రిడిటేషన్ కార్డులను రద్దు చేయాలని ఆదేశాలు ఉన్నప్పటికిని,జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి, మీడియా కమిటీ చైర్మన్ గా బాధ్యత వహిస్తున్న జిల్లా కలెక్టర్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2016 సంవత్సరంలో విడుదల చేసిన జీవో నెంబర్ 239లో ఉన్న నియమ నిబంధనలు పట్టించుకోకపోవడంతో, విసుకు చెందిన జర్నలిస్టు లు మానవ హక్కుల కమిషన్ ను ఆశ్రయించవలసి వచ్చింది. తెలంగాణ రాష్ట్రం ముఖ్య పరిపాలన అధికారి చీఫ్ సెక్రటరీ, సంబంధిత సమాచారం పౌర సంబంధాల శాఖ కమిషన్ కి ఇచ్చిన ప్రత్యేకలేఖ రాసినప్పటికీ కూడా, గతంలో ఉన్న జిల్లా కలెక్టర్ మీడియా కమిటీ చైర్మన్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న, జర్నలిస్ట్ అక్రిడేషన్ విషయంలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించలేదు. స్వయంగా అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాసిన లేఖలు సైతం బుట్ట దాఖలు చేసిన సంఘటన విదితమే. సంబంధిత అధికారులపై నేటికీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం పై మీరే అర్థం చేసుకోవాలి. ఇప్పటికైన తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఇచ్చిన ఆదేశాలైన పాటిస్తారో, లేదో వేచి చూడాల్సిందే. ఎంతో నిక్కర్సిగా విధులు నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్, అప్పటి కొందరి నేతల ప్రోత్సాహంతోనో, లేదా కొన్ని సంఘాల ఒత్తిడికి లోనై, అనర్హులకు సైతం అక్రిడేషన్లు అందజేశారు. ఇప్పటికీ కొన్ని సంస్థల పత్రికలలో జర్నలిస్టుగా అక్రిడేషన్ పొందిన వారు, వేరేపత్రికలోకి వెళ్ళినప్పుడు, లేదా పత్రిక నుండి పూర్తిగా వైదొలిగిన వారి అక్రిడేషన్లను డిపిఆర్వోలు సమాచారం సేకరించి తిరిగి తీసుకొని రద్దు చేయాల్సి ఉంటుంది. కానీ కొందరు సంస్థలు అడ్డుపెట్టుకొని వార్తలు రాయని వారికి సైతం, అక్రిడేషన్లు ఇప్పించి ముడుపులు పొందినట్లుగా ఆరోపణలు వెల్లువెత్తాయి. ఫీల్డ్ కు సంబంధం లేనివారికి, కనీస విద్యార్హత లేని వారికీ కూడా కార్డులు ఇష్యూ చేశారు.ఇప్పటికీ ఎన్నో పత్రికలలో నుండి వెళ్లిపోయిన వారి అక్రిడేషన్లను స్వాధీనం చేసుకోకపోవడం విడ్డూరమని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, డి పి ఆర్ ఓ అధికారులు పూర్తిస్థాయి విచారణ జరిపి, అనర్హుల అక్రిడేషన్లను రద్దు చేయాలని పలువురు జర్నలిస్టు కోరుతున్నారు. గతంలో చేసిన ఉన్నత అధికారులు, నేడు నిజాయితీగా పనిచేస్తున్న జిల్లా కలెక్టర్, డిపిఆర్ఓ అధికారులు హెచ్ఆర్సీకి హాజరు కాకపోవడం, ఒకవేళ హాజరైనప్పటికీ, గతంలో చేసిన అధికారుల తప్పిదాలను హెచ్ఆర్సీకి వివరించి, ఈసారి అందించే అప్లికేషన్లలో నిజమైన వార్తలు రాసే పత్రిక జర్నలిస్టులకు అందించాలని పలువురు జర్నలిస్టులు కోరుతున్నారు. ఇప్పటికీ వార్తలు రాయరాని వారు, ఒక పత్రిక నుండి ఇంకో పత్రికకు వెళ్ళినవారు వద్ద అక్రిడేషన్ ఉండడం గమనర్హం. ఇకనైనా ఇలాంటి తప్పిదాలు జరగకుండా ఈసారి పటిష్టమైన చర్యలు చేపట్టి నిజమైన వార్తలు రాసే జర్నలిస్టులకు అందించాలని కోరుతున్నారు.




# నేతృత్వ పోటీలు విద్యార్థుల నైపుణ్యాన్ని వెలికితిస్తాయి



తార్నాక(ప్రశ్న న్యూస్) తార్నాక నారాయణ పాఠశాలలో ఈ కిడ్జ విద్యార్థుల నేతృత్వ సమావేశం ఘనంగా నిర్వహించారు. తరగతులలో నేర్చుకున్న విషయాలను, ప్రాజెక్టులను, వైజ్ఞానాన్ని ఆ చిన్ని విద్యార్థులు తయారు చేసి ప్రదర్శించారు. విద్యార్థులు వారు నేర్చుకున్నటువంటి పాఠాలను అనర్గలంగా తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా జి.ఎం. గోపాల్ రెడ్డిగ, ఏ.జి.యం. బాలపరమేశ్వరావు లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే కొత్త కొత్త ప్రయోగాలను చేయడానికి ముందుకు రావడం చాలా గర్వకారణం అన్నారు, విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు నేతృత్వ పోటీలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ పర్వేన్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ చదువుతో పాటు అన్ని రంగాలలో ముందుండాలని తెలిపారు. ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, భయాన్ని అధిగమించే ధైర్యాన్ని ఇస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈ-కిడ్జ ఆర్.డి.హెడ్ మీనా,ఈ కిడ్జ కో- ఆర్డినేటర్- నూర్, ఈ-కిడ్జ విపి షాహీన్. ఏ ఓ మహేందర్, పిఈటీ నరేష్, సాఫ్ట్ స్కిల్స్ డిపార్ట్ మెంట్ పూజ, ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


# శ్రీకాళహస్తిలో టిడిపి కార్యకర్తలు ప్రమాణ స్వీకారం




శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) ఘనంగా శ్రీకాళహస్తి పట్టణం, మరియు తొట్టంబేడు మండలా పరిధిలో నిర్వహించిన తెలుగుదేశం పార్టీ మండల, గ్రామ, వార్డు అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్ ఇన్చార్జులు, బూత్ లెవెల్ ఏజెంట్ల ప్రమాణస్వీకారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సమక్షంలో జరిగిన ప్రమాణస్వీకార కార్యక్రమం శ్రీకాళహస్తి పట్టణం మరియు తొట్టంబేడు మండలం నుంచి భారీగా వచ్చిన కార్యకర్తలు నాయకులు ప్రతి కార్యకర్త కు న్యాయం చేయడమే నా లక్ష్యం ఎమ్మెల్యే బొజ్జల పార్టీ విజయం కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి గుర్తింపు లభించేలా బాధ్యతలు కేటాయించామని, అన్ని వర్గాలకూ సమాన ప్రాతినిధ్యం కల్పించామని తెలిపిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి.

# ఫాస్ట్ ట్రాక్ - ఫోక్సో న్యాయమూర్తి రాధిక జైస్వాల్‌కు వేములవాడ బార్ అసోసియేషన్ సన్మానం

**- అధ్యక్షులు సదానందం నేతృత్వంలో మర్యాదపూర్వకంగా సమావేశం**



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఫాస్ట్ ట్రాక్,ఫోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తిగా నియామకం పొంది బాధ్యతలు చేపట్టిన రాధిక జైస్వాల్ ను గురువారం వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిసె సదానందం నేతృత్వంలో ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు.అధ్యక్షులు గుడిసె సదానందం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి కి శాలువాతో ఘన సన్మానం చేసి, వేములవాడ రాజన్న లడ్డూ ప్రసాదం అందజేశారు. ఆమెకు భవదీయులుగా శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గడ్డం సత్యనారాయణ రెడ్డి, కటకం జనార్ధన్, నాగుల సంపత్ కుమార్,బొజ్జ మహేందర్, గుజ్జే మనోహర్, గుడిపల్లి మహేష్ కుమార్, రాజశేఖర్, మహిళా న్యాయవాదులు జక్కుల పద్మ, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు తీరు మార్చుకోకపోతే ప్రజా ఆగ్రహానికి గురికాక తప్పదు

**తాగునీటి పంపిణీలో ఇబ్బందులు తలెత్తితే ఉద్యమాలకు సిద్ధం**


**రిజర్వాయర్లలో సరిపడా నీటి నిల్వలు ఉన్న పంపిణీలో జాప్యం ఎందుకు**

**అధికారులపై ఎమ్మెల్యే తీవ్ర అసహనం**

**ప్రజల దాహార్తి తీర్చిన తర్వాతే పరిశ్రమలకు నీటి సరఫరా**

**మూడు నెలలకు ఒకసారి సైతం మంచినీరు రావడం లేదు**

**అధికారుల సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే జీఎంఆర్**





పటాన్ చెరు (ప్రశ్న న్యూస్) పటాన్ చెరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మిషన్ భగీరథ మరియు గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్ డబ్ల్యూ ఎస్) అధికారులతో ఎమ్మెల్యే జిఎంఆర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికి ప్రతి రోజు స్వచ్ఛ జలాలు అందించాల్సిన గ్రామీణ నీటిపారుదల విభాగం అధికారులు నీటి పంపిణీ అంశంలో ఘోరంగా విఫలం అవుతున్నారని.. ఇస్నాపూర్, ఇంద్రేశం మున్సిపాలిటీల పరిధిలోని గ్రామాలకు మూడు నెలలకు ఒకసారి మంచినీరు సరఫరా అవుతున్నాయని.. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అధికారులను హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని రుద్రారం, లకడారం, ఇస్నాపూర్, పాశమైలారం, క్యాసారం, చిట్కుల్, తెల్లాపూర్ పరిధిలోని పోచారం, ఇంద్రేశం పరిధిలోని బచ్చుగూడ, ఇంద్రేశం, రామేశ్వరం బండ, పెద్దకంజర్ల, చిన్నకంజర్ల, ఐనోలు, అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని సుల్తాన్పూర్, వడకపల్లి, దాయర తదితర గ్రామాలకు గత రెండు సంవత్సరాలుగా మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రజలకు సక్రమంగా మంచినీరు పంపిణీ కావడం లేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మనిషి జీవనానికి అత్యంత కీలకమైన తాగునీటిని అందించడంలో విఫలమైతే ప్రజలు నమ్ముకుని ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులకు, ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని తెలిపారు. సింగూరు, కాళేశ్వరం రిజర్వాయర్లలో మంచినీటి నిల్వలు సరిపడా ఉన్నప్పటికీ పంపిణీ అంశంలో ఎందుకు విఫలమైతున్నారని అధికారులను ప్రశ్నించారు. ఇదే అంశంపై గతంలోనూ సమీక్ష సమావేశాలు నిర్వహించిన మార్పు రాకపోవడంపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పలు గ్రామాలకు మూడు నెలలకు ఒకసారి మంచి నీరు విడుదల అవుతున్నాయని.. ప్రజలు ఎలా బతకాలని ఆయన ప్రశ్నించారు. పాశమైలారం పారిశ్రామిక వాడకు మాత్రం నిరాటంకంగా మంచినీరు సరఫరా అవుతున్నాయని. ప్రజలకు వచ్చేసరికి ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. పరిశ్రమకు నీళ్లు అందించడానికి తాము వ్యతిరేకించడం లేదని... ప్రథమ ప్రాధాన్యతగా ప్రజలకు అందించిన తర్వాతనే మిగతా విభాగాలకు అందించాలని ఆయన అధికారులకు సూచించారు. మంచినీటి పంపిణీ అంశంపై నిత్యం గ్రామీణ ప్రాంతాలు, కాలనీల ప్రజల నుండి వందలాది ఫిర్యాదులు తమకు అందుతున్నాయని.. ఇదే పరిస్థితులు కొనసాగితే ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఖాళీ బిందెలతో రహదారుల ఇబ్బందించే పరిస్థితులు తలెత్తకుండా తక్షణమే పంపిణీ అంశంలో చర్యలు తీసుకోవాలని సూచించారు. నిధుల అంశంలో ఇబ్బందులు తలెత్తితే తనను నేరుగా సంప్రదించాలని. ప్రభుత్వంతోపాటు సిఎస్ఆర్ నిధులు అందించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ఎమ్మెల్యే జిఎంఆర్ అధికారులకు సూచించారు. రాబోయే వారం రోజులలో పూర్తిస్థాయి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి.. ప్రతి గ్రామానికి నిర్దేశించిన విధంగా మంచి నీటిని సరఫరా చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మిషన్ భగీరథ ఎస్ఈ రఘువీర్, ఈఈ విజయ లక్ష్మి, డీఈలు హరీష్, శ్రీనివాస్, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, ఆయా గ్రామాల మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఇండక్షన్ ప్రోగ్రామ్ పాల్గొన్న ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల జిల్లా (ప్రశ్న న్యూస్) జగిత్యాల జిల్లా కేంద్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఇండక్షన్ ప్రోగ్రామ్ , వైట్ కోట్ సెర్మనీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కపాల్గొనీ మొదటి సంవత్సరంలో ఉత్తమ పలితాలు సాధించి డిస్టింగ్షన్ లో పాసైన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు ,మెడల్స్ అందజేసి జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ విద్యార్థులను సత్కరించారు. అనంతరం ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే డా సంజయ్ కు మెమెంటో అందజేసి శాలువాతో ప్రిన్సిపాల్ డా.సునీల్ , సూపరిండెంట్ డా.కృష్ణ మూర్తి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్, ప్రిన్సిపాల్ డా.సునీల్ , సూపరిండెంట్ డా.కృష్ణ మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ డా. అర్చన, ప్రొఫెసర్స్ హెచ్ ఓ డి లు, మెడికల్ విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



# 60 లక్షల రూపాయలతో ఇంద్రేశం రహదారి అభివృద్ధి

**అతి త్వరలో పూర్తిస్థాయిలో రహదారి విస్తరణ.. నిర్మాణం**

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**



పటాన్ చెరు (ప్రశ్న న్యూస్) శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్చెరు నుండి ఇంద్రేశం మీదుగా పెద్ద కంజర్ల వరకు గల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందించేందుకు అతి త్వరలో హెచ్ఎండిఏ ద్వారా రహదారి విస్తరణ పనులు చేపట్టనున్నట్లు పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్ చెరు పరిధిలోని ఓఆర్ సర్వీస్ రోడ్డు నుండి ఇంద్రేశం మీదుగా పెందకంజర్ల వరకు 60 లక్షల రూపాయల నిధులతో చేపట్టనున్న బీటీ ప్యాచ్ వర్క్ పనులకు ఎమ్మెల్యే జీఎంఆర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రమైన పటాన్చెరు పట్టణానికి ఇంద్రేశంతో పాటు. రామేశ్వరం బండ, పెద్దకంజర్ల, చిన్న కంజర్ల, ఐనోలు, బచ్చు గూడెం, పోచారం తో పాటు నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలు ఈ రహదారినే వినియోగిస్తారని తెలిపారు. గతంలో ఇంద్రేశం నుండి పెద్దకంచెర్ల వరకు 22 కోట్ల రూపాయలతో రహదారి విస్తరణ పనుల కోసం నిధులు కేటాయించడం జరిగిందని తెలిపారు. అనివార్య కారణాల వలన విధుల కేటాయింపు రద్దు కావడం మూలంగా.. తిరిగి రహదారి వరమ్మత్తులు చేపట్టారని. ప్రస్తుత ప్రభుత్వంలోని మంత్రులకు విజ్ఞప్తి చేయడం జరిగిందని తెలిపారు. అతి త్వరలో రహదారి విస్తరణ పనులు సైతం ప్రారంభిస్తామని తెలిపారు. ప్రస్తుతానికి 20 లక్షల రూపాయల ప్రభుత్వ నిధులతో బీటీ ప్యాచ్ వర్క్ పనులు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.?

# నెల రోజులు మీకు టైం ఇస్తున్నాము

**- లేకపోతే పెద్ద ఎత్తున కలెక్టరేట్ ముట్టడి చేస్తాం**

**- ఇటీవల వర్షాలకు పాడైన రోడ్లను వెంటనే బాగు చేయాలి**




ధర్పల్లి(ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల్ గోవింద్ పల్లి గ్రామంలో చెరువుగట్టు పక్కనే రహదారి ఉంది చెరువులో నీళ్లు ఉండడం వల్ల ఊటలు నీరు రోడ్డుపైకి వచ్చి రోడ్లన్నీ కరాబ్ అయిపోయింది వాటిని నిజామాబాద్ జిల్లా బిజెపి అధ్యక్షలు దిణేష్ కులచారి ఆధ్వర్యంలో మొరంబోసి మరమ్మత్తులు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూరల్ నియోజకవర్గం




మొత్తంలో రోడ్లన్నీ వర్షాలకు దెబ్బ తిన్నాయి వాటిని డంబార్ రోడ్ చేయాలీ లేకుంటే నెల రోజుల టైం ఇస్తున్నాం లేకపోతే కలెక్టర్ ముట్టడి కచ్చితంగా చేస్తామని ఆయన అన్నారు. మీరు రోడ్లు చేయలేని పరిస్థితి ఉంటే సెంట్రల్ గవర్నమెంట్ నిధులు చాలా ఉన్నాయి వాటిని వాడుకుందాం అని ఆయన అన్నారు. ప్రతి వ్యక్తికి తన ఊరు నుండి వేరే ఊరు కు వెళ్లడానికి రోడ్లు బాగుంటేనే వెళతారు రోడ్లు బాగా లేకపోతే ఎక్కడికి వెళ్ళిన పరిస్థితి ఉంటది ఇక్కడ గోవిందు పల్లి రోడ్డు మరి అద్వానంగా ఉంది మొరం తెచ్చి రోడ్డు బురద లేకుండా చేసిన ఈ చెరువు కట్టకు సైడ్ వాల్ కట్టి దాని పక్కనే మోరి ఏర్పాటు చేసి చెరువులో ఊటల ద్వారా వచ్చే నీటిని దారి మల్లించి రోడ్డుపైకి రాకుండా చేస్తే బాగుంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నాయుడు రాజన్న, ధర్పల్లి మండల బిజెపి అధ్యక్షుడు మహిపాల్ యాదవ్, గోవిందప ల్లి బిజెపి గ్రామ అధ్యక్షుడు, సీనియర్ బిజెపి నాయకులు కరక గంగారెడ్డి, కోమటి దాసు, తాళ్ల రాము, కరోల శ్రీకాంత్, రాజమల్లు, తదితరులు పాల్గొన్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదం

**శ్రీరాములపల్లికి చెందిన యువకుడు ఈశ్వరయ్య మృతి**





**కరీంనగర్ / కొడిమ్యాల** కరీంనగర్ పట్టణంలోని పద్మనగర్ బైపాస్ రోడ్డులోని ముద్దసాని గార్డెన్స్ ఎదుట గురువారం ఉదయం విషాదకర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది.ఈ ఘటనలో చొప్పదండి నియోజకవర్గం, కొడిమ్యాల మండలం, శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన గడ్డం ఈశ్వరయ్య (35) అక్కడికక్కడే మృతి చెందాడు.మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారయివృత్తిరీత్యా పెయింటింగ్ పని చేస్తూ జీవనం సాగిస్తున్న ఈశ్వరయ్య గురువారం ఉదయం కోతిరాంపూర్ ప్రాంతంలో ఉన్న పనికి తన మిత్రునితో కలిసి స్కూటీ (%ూ 02 జుజు% 9200) పై బయలుదేరాడు. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న %ు+ 02 ు% 1134 నెంబరు గల లారీ డ్రైవర్ అతి వేగంగా, నిర్లక్ష్యంగా స్కూటీని ఢీకొట్టాడు.ఢీకొట్టడంతో స్కూటీ నడుపుతున్న వ్యక్తికి స్వల్ప గాయాలు కాగా, వెనుక సీట్లో ఉన్న ఈశ్వరయ్య లారీ చక్రాల కిందపడి తీవ్రంగా గాయపడి తల నుజ్జునుజ్జు కావడంతో అక్కడికక్కడే దుర్మరణం పొందాడు.స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు కరీంనగర్ ద్వితీయ పట్టణ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# జీతాలు లేక రోజు గడవక భారమైన బతుకులు

## ఎన్ఎచ్ఎం ఎంప్లాయిస్ పెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఎండి. రహీం

**- రెండు నెలలుగా జీతాల్లేక పస్తులతో కాలం వెళ్లదీస్తున్న ఎన్ఎచ్ఎం ఉద్యోగులు**

**- సమయాని అందని వేతనాలతో అర్థిక ఇబ్బందుల్లో చిరుద్యోగులు**

**- రెండు సంవత్సరాలుగా అందని పిఓఎల్ బిల్లులు**

**- గత పిఆర్సీ ఏడు నెలల బకాయిల జాడేలేదు.**

**- చెప్పులరిగేలా అధికారుల చుట్టు తిరిగినను పరిష్కారం కాని సమస్యలు - చెత్త బుట్ట పాలైన అర్జీలు**

**- వెంటనే తమ సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి.**

**- సమయానికి జీతాలిచ్చి, మా సమస్యలు పరిష్కరిస్తే తమను మరింత మెరుగైన సేవలందిస్తాం**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) గత రెండు నెలలుగా జీతాలు అందక పోవడంతో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల బతుకులు ఆగమాగం అవుతున్నాయని, చాలిచాలని జీతాలతో సమయపాలన లేని ఉద్యోగ భాధ్యతలతో సతమతమవుచు బతుకుఈడుస్తున్న ఎన్ఎచ్ఎం ఉద్యోగులకు చెల్లించే జీతాలు సమయానికి రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలంగాణ రాష్ట్ర ఎన్ఎచ్ఎం ఎంప్లాయిస్ పెడరేషన్ ప్రధాన కార్యదర్శి యండి.రహీం తీవ్ర స్థాయిలో విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా వైద్యశాఖలో ఉన్న అన్ని విభాగాలకు సంబంధించిన కాంట్రాక్ట్ - అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు లేక చాలా ఇబ్బందుల పాలవుతున్నారని తెలిపారు. కుటుంబ పోషణతో పాటు ఇంటి అద్దెలు, ఇతరత్ర ఖర్చులకు డబ్బులు లేక పస్తులుండే పరిస్థితులు దాపురించాయని, గత రెండు, మూడు నెలలుగా జీతాలు లేకపోవడంతో అప్పులు కూడా పుట్టడం లేదని, పిల్లలు స్కూల్ ఫీజులు చెల్లించక పోవడంతో పిల్లలు స్కూళ్ళకు దూరమయ్యే దారుణ పరిస్థితులు దాపురించాయని ఆవేదన వ్యక్తం చేసారు. ఇప్పటికే జీతాలు లేక రెండు నెలలు దాటిందని, గత పిఆర్సీకి చెందిన ఏడు నెలల బకాయిలు ఇప్పటి వరకు అందలేదని అన్నారు. పెండింగ్‌లో ఉన్న రెండు నెలల జీతాలతో పాటు ఏడు నెలల పిఆర్సీ బకాయిలను వెంటనే అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు.

### సమస్యలు పరిష్కరిస్తే మరింత మెరుగైన సేవలందిస్తాం

గత రెండు మూడు నెలలుగా జీతాలు లేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతు ఆపసోపాలు పడుతున్నామని ఇప్పటికైనా ఎన్ఎచ్ఎం సిబ్బందికి ఇవ్వాల్సిన పెండింగ్ జీతాలతో పాటు గత పిఆర్సీకి చెందిన ఏడు నెలల బకాయిలను వెంటనే చెల్లించి తమ సమస్యలు పరిష్కరిస్తే ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలను అందిస్తామని, త్వరగా ప్రభుత్వం నిర్ణయం తీసుకొని జీతాలతో పాటు తమకు రావాల్సిన బకాయిలను చల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు.

### రెండు సంవత్సరాలుగా అందని పిఓఎల్ బిల్లులు

సమయానికి జీత భత్యాలు అందక పోవడంతో ఉద్యోగ భాధ్యతలను నిర్వర్థించడలో ఎన్ఎచ్ఎం ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుచున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. తాము ఎదుర్కోంటున్న సమస్యలు పరిష్కరించాలని అన్ని స్థాయిల అధికారులకు ఏకరువు పెట్టినను స్పందన లేదని, అసలు తమ గురించి పట్టించుకునే నాధుడే కరువైన్నారని తీవ్ర స్థాయిలో ద్వజమెత్తారు. అధికారుల చుట్టు చెప్పులరిగేలా తిరిగి తాము ఇచ్చిన అర్జీలు చెత్తబుట్ట పాలవడం తప్ప పరిష్కారం దొరకలేదని విచారం వ్యక్తం చేసారు. ఇప్పటికే రెండు సంవత్సరాలుగా విధి నిర్వాహణలో ఖర్చు చేసిన పిఓఎల్ బిల్లుల డబ్బులు అందలేదని, ఇక రెండు మూడు నెలలుగా జీతాలు లేని ఈ పరిస్థితుల్లో పిఓఎల్ ఖర్చు బరిస్తు ఉద్యోగ భాధ్యతలు నిర్వర్థించడానికి తమ ఆర్థిక పరిస్థితులు సహకరించడం లేదని తెలుపారు. తమకున్న సమాచారం ప్రకారం ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉద్యోగుల ఆధార్ వివరాలను అప్ డేట్ చేస్తుండడంతో జీతాల చెల్లింపులకు జాప్యం జరుగుచున్నదని, ఇప్పటికే అప్ డేట్ చేయబడిన ఉద్యోగులకు జీతాలు చెల్లించడంలో ఉన్న ఇబ్బందులేంటో అధికారులు స్పష్టం చేయాలను డిమాండ్ చేసారు. తాము ఎదుర్కోంటున్న సమస్యలపై వైద్యారోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమీషనర్, వైద్యారోగ్యశాఖ సంచాలకులు, ఎన్ఎచ్ఎం అధికారుల దృష్టిసారించి పరిష్కారాన్ని చూపాలని రహీం డిమాండ్ చేసారు.

# పెన్షనర్లను చంపకండి

## పెన్షన్ బకాయిలు చెల్లించండి

**- ప్రభుత్వ పెన్షనర్స్ జేఏసీ**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల పట్ల రాష్ట్ర ప్రభుత్వ చూపిస్తున్న నిర్లక్ష్య వైకరికి వ్యతిరేకంగా వైద్య ఆరోగ్యశాఖ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులుఓ తీవ్రస్థాయిలో విరుచుకు పడ్డారు. తమ అపరికృత సమస్యలపై ఏర్పాటు చేసిన సమావేశంలో భాగంగా రాష్ట్ర అధ్యక్షులు భరత్ సత్యనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసమూర్తి, రాష్ట్ర ఉపాధ్యక్షులు రాబర్ట్ బ్రూస్ మాట్లాడుత గత సంవత్సరం (2024) మార్చి నుండి పదవి విరమణ చెందిన ఉద్యోగులకు రావలసిన పెన్షన్ బెనిఫిట్స్, బకాయలు నేటి వరకు అందకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. తమకు రావలసిన పెన్షన్ బకాయలు వెంటనే విడుదల చేయాలని ఈ సందర్బంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ సదర్బంగా వారు

**- పెన్షనర్లను చంపకండి - బ్రతకనీయండి**



**- పెన్షనరీ బెనిఫిట్స్ వెంటనే చెల్లించండి-ఆత్మహత్యలు ఆపండి"**

పెన్షనరీ బెనిఫిట్స్ చెల్లించకుండా పెన్షనర్ల కు న్యాయం చేయాలనే నినాధాలతో ప్రభుత్వానికి తమ నిరసనను తెలిపారు.

ఉద్యోగులు పెన్షనర్ల పట్ల పక్షపాత ధోరణితో ఇచ్చిన హామీలు మరిచి మొండి చేయి చూపటం ప్రభుత్వానికి తగదని, "ఏరు దాటేవరకు ఓడ మల్లయ్య - ఏరు దాటాక బోడ మల్లయ్య" అన్న చందంగా ప్రభత్వ వ్యవహం ఉందని, పదవి విరమణ చేసిన తాము ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతుండగా పెన్షన్ బెనిపిట్స్ ఆపి తమ జీవితాలతో చలగాటం ఆడుచున్న ప్రభుత్వ వైఖరిపై తీవ్ర స్థాయిలో నిరసన వ్యక్తం చేసారు.

# మణికంఠ సేవాసమితి ఆధ్వర్యంలో 41 రోజులు అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద కార్యక్రమం



**ఉప్పల్( ప్రశ్న న్యూస్ )** హబ్సిగూడ డివిజన్ వెంకట్ రెడ్డి నగర్ లో మణికంఠ సేవా సమితి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు 41 రోజులు అన్నప్రసాద కార్యక్రమం నవంబర్ 21వ తేదీ నుండి 31 డిసెంబర్ వరకు అయ్యప్ప స్వాములకు మధ్యాహ్నం అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని 21వ తేదీ అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమం నిర్వహిస్తున్న సందర్భంగా సీనియర్ పాత్రికేయులు కీర్తి సంతోష్ రాజ్ కు ఆహ్వాన పత్రికను అందించారు. ఈ సందర్భంగా మణికంఠ సేవా సమితి అధ్యక్షులు జిల్లా హరిబాబు గుప్త మాట్లాడుతూ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో మణికంఠ సేవా సమితి ఆధ్వర్యంలో 16 సంవత్సరాల నుండి 41 రోజులు అయ్యప్ప స్వాములకు అన్నదాన ప్రసాద కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఈనెల 21వ తేదీ అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమం గురు స్వామి య.స్.ఆచార్య ఆత్రేయ పూజా కార్యక్రమం నిర్వహిస్తున్నారని, అన్నదాన ప్రసాద కార్యక్రమానికి సహకరిస్తున్నటువంటి దాతలకు, కమిటీ సభ్యులకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి గుద్దేటి శరణ్యయ్య, అన్నదాన ప్రసాద కమిటీ చైర్మన్ మంచాల వీర ప్రకాష్ గుప్త, జూలూరి విజయకుమార్ తదితరులు ఆహ్వాన పత్రిక అందించారు.

# మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్ నీ కలిసిన ఉప్పల్ శాసనసభ్యులు



**ఉప్పల్ (ప్రశ్న న్యూస్)** మల్లాపూర్ సర్వే నెం 110 లోని 300 గజాల ప్రభుత్వ స్థలం, 1996 లో అప్పటి ప్రభుత్వం ఆదేశాల మేరకు, అప్పటి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నవోదయ మహిళ మండలికి కేటాయించిన స్థలంలో అప్పటి కాప్రా మున్సిపాలిటీ వారు శాశ్వత భవనం నిర్మించడం జరిగింది.సదారు స్థలంలో భవన నిర్మాణం చేసిన తరువాత మిగిలిన ఖాళీ స్థలానికి ప్రహరీ గోడ శంకుస్థాపన చేశారు. కాని ఇట్టి స్థలాన్ని కొందరు తప్పుడు పత్రాలు సృష్టించి కబ్జాకు ప్రయత్నిస్తున్న నేపథ్యంలో అట్టి స్థలాన్ని కబ్జాలను నుండి కాపాడి ప్రజలకు ఉపయోగ పడే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక ఉప్పల్ శాసన సభ్యులు బండారి లక్ష్మారెడ్డి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి కి వివరించి వినతిపత్రాన్ని సమర్పించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, పి జి సుదర్శన్, రాజేష్, గున్న, రఘు తదితరులు పాల్గొన్నారు.

# మధుమేహం పట్ల అప్రమత్తత ఏదీ?

చక్కెర వ్యాధి... ఈ వ్యాధికి పేరులోనే చక్కెర... దాని ఫలితమంతా ఎంతో చేదు. ఆ వ్యాధి వస్తే చక్కెరకు ఇక దాదాపుగా దూరమైపోయినట్లే. షుగర్ వ్యాధిని ఆధునిక యుగపు మహమ్మారిగా భావించవచ్చు. అత్యంత వేగంగా పరుగెడుతున్న కాలంతో పాటే అనివార్యంగా జీవనశైలిలో చోటుచేసుకుంటున్న మార్పులే షుగర్ వ్యాధికి అసలు కారణం. మౌలికంగా ఇది జీవన శైలి సమస్య. వేదకాలంలో మధుమేహ ప్రస్తావన ఉంది. ఆ కాలంలో మధుమేహాన్ని 'అశ్రవ' అనే పేరుతో గుర్తించారు. ఈ వ్యాధి ఎలా వస్తుంది వ్యాధి లక్షణాలు ఏమిటి అని చరక సంహిత, శుశ్రవ సంహిత, నాగభట్ట గ్రంథాలలో వివరించారు. క్రీస్తు శకానికి వెయ్యి సంవత్సరాల కిందటనే ఈ వ్యాధి వర్ణన ఉండడం విశేషం. యజ్ఞ సమయాలలో దేవతలకు సమర్పించే హవిస్సును భుజించడం వలన ఈవ్యాధి వచ్చినట్లు పేర్కొన్నారు. దక్ష ప్రజాపతి చేసిన యజ్ఞంలో హవిస్సు భుజించడం వలన ఈ వ్యాధి వచ్చినట్లు ప్రస్తావన ఉంది. క్రీస్తు శకం ఆరవ శతాబ్దంలో అష్టాంగ హృదయ అనే గ్రంధంలో మధుమేహం అనే పదం వాడబడింది. తేనెను మధువు అని అంటారు కనుక ఈ వ్యాధిగ్రస్థుల మూత్రం తేనెరంగు ఉంటుందని దీనికి ఈ పేరు వచ్చిందని భావన. 1400 సంవత్సరాల క్రితమే ఈ వ్యాధిని పత్యం, ఔషధం, వ్యాయామంతో క్రమపరచవచ్చని పేర్కొన్నారు. దాదాపు ఇప్పటికీ అనుసరిస్తున్న విధానం అదే కావడం గమనార్హం. అంత ర్జాతీయ మధు మేహ సమాఖ్య, ప్రపంచ ఆరోగ్య సంస్థలు 1991 నుండి ప్రతి సంవత్సరం నవంబరు 14వ తేదిని మధుమేహ దినంగా పాటిస్తున్నాయి. 1922లో ఇన్సులిన్ హార్మోన్‌ను కనుగొన్న ఫ్రెడరిక్ బేంటింగ్ జన్మదినాన్ని పురస్కరించుకుని నవంబర్ 14న మధుమేహ దినంగా పాటిస్తున్నారు. 2006 డిసెంబర్ 20న ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ ఆమోదించిన తీర్మానం ప్రకారం మధుమేహ వ్యాధి ప్రపంచవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తున్న, ఆందోళనకర దీర్ఘకాలిక వ్యాధి కాబట్టి 2007నుండి మధుమేహ దినాన్ని ప్రజల్లో అవగాహం , చైతన్యం పెంచే కార్యక్రమాలతో సభ్యదేశాలన్ని అధికారికంగా జరపాలని ఐక్యరాజ్యసమితి పేర్కొన్నది.

డయాబెటీస్ ఎలా వస్తుంది , దానివలం వచ్చే ముప్పు ఏమిటి , రాకుండా ఏమి చేయాలి , వచ్చాక ఎలాంటి జాగ్రత్తలు తీలుకోవాలి అనే అంశాలను ప్రచారము చేసే ప్రయత్నమే ఈ డయాబెటిక్ డే ముఖ్య ఉద్దేశము. ప్రపంచ మధుమేహ రాజధానిగా భారత్ మారిపోయింది. మధుమేహ సమస్య భారత్‌లో అత్యధికంగా ఉంది. ప్రస్తుతం ప్రపంచంలో 15 కోట్ల మంది, దేశంలో 4 కోట్ల మంది ఈ వ్యాధితో బాధపడుతున్నట్లు అంచనా. 2025 నాటికి భారత దేశంలో ఈ వ్యాధిపీడితుల సంఖ్య 7 కోట్లకు చేరుకోగలదని భావిస్తున్నారు. భారత్‌లోని అన్ని రాష్ట్రాలతో పోలిస్తే ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఈ వ్యాధి మరింత అధికంగా ఉంది. మధుమేహం కారణంగా ప్రతీ నిమిషానికి ఆరుగురు మరణిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతీ 20 మరణాల్లో ఒకటి మధుమేహం కారణంగానే చోటు చేసుకుంటున్నది. మధుమేహం, సంబంధిత వ్యాధుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఏటా 32 లక్షల మంది మరణిస్తున్నారు. మధుమేహం ను నిశ్శబ్దహంతకిగా అభివర్ణిస్తారు. దీన్ని నివారించడం అంత తేలిక కానప్పటికీ, కొన్ని రకాల విధివిధానాలు పాటించడం ద్వారా దీన్ని సమర్థంగా ఎదుర్కోవచ్చు. మధుమేహం లేదా చక్కెర వ్యాధిని వైద్యభాషలో "డయాబెటిస్ మెల్లిటస్" అని వ్యవహరిస్తారు. డయాబెటిస్ అని కూడా వ్యవహరించే ఈ వ్యాధి, ఇన్సులిన్ హార్మోన్ స్థాయి తగ్గడం వల్ల కలిగే అనియంత్రిత మెటబాలిజం, రక్తంలో అధిక గ్లూకోజ్ స్థాయి వంటి లక్షణాలతో కూడిన ఒక రుగ్మత. అతిమూత్రం (పాలీయూరియా), దాహం ఎక్కువగా వేయడం (పాలీడిప్సియా), అతిగా ఆకలి వేయడము (పాలీ ఫేజియా), మంద గించిన చూపు, కారణం లేకుండా బరువు తగ్గడం, బద్ధకం దీని ముఖ్య లక్షణాలు. మధు మేహం లేదా చక్కెర వ్యాధిని సాధారణంగా రక్తంలో మితి మీరిన చక్కెర స్థాయిని బట్టి గుర్తిస్తారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం భారత దేశం, చైనా, అమెరికాలలో అత్యధికంగా ఈ వ్యాధి ప్రబలి ఉన్నది. ఈ వ్యాధిని పూర్తిగా తగ్గించే మందులు లేవు. జీవితాంతం తగిన జాగ్రత్తలు తీసుకొన్నట్లయితే దీన్ని అదుపులో ఉంచుకోవడం సాధ్యం.

1921లో ఇన్సున్ అందుబాటులోకి రావడంతో అన్ని రకాలను నియంత్రించడం సాధ్యమయ్యింది. ఆహార అలవాట్ల మార్పు కూడా భాగమయినప్పటికీ, ఇన్సులిన్ ఉత్పత్తి లేని మొదటి రకాన్ని నియంత్రించడానికి ఇన్సులిన్ ఇంజెక్షన్ ఇవ్వటం తప్పనిసరి మార్గం. రెండవ రకం ఆహార అలవాట్ల మార్పు, ఆంటీ డయాబెటిక్ మందుల వాడకం వల్ల, అప్పుడప్పుడు ఇన్సులిన్ వాడకం వల్ల నియంత్రించవచ్చు. చక్కెర శాతం 400 మి.గ్రా. కన్నా ఎక్కువ కావడం...దీనినే డయాబెటిక్ కీటో అసిడోసిస్ అని కూడా అంటారు. ఈ స్థితిలో ఎక్కువగా దాహం, నాలుక తడారి పోవడం, మత్తుగా ఉండడం, వాంతులు, పొత్తి కడుపునొప్పి, తలనొ ప్పి, తలతిరగడం, విపరీతమైన నీరసం, ఒళ్ళు నొప్పులు లక్షణాలుగా ఉంటాయి. ఈ సమయంలో వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. ఈ దశలో కూడా తాత్సారం చేస్తే మరణానికి దారి తీయవచ్చు. రక్తంలో చక్కెర శాతం 60 మి.గ్రా కన్నా తగ్గడం..షుగర్ లేదా హైపోగ్లైసి మియా అంటారు. మధుమేహ వ్యాధిని రక్త, మూత్ర పరీక్ష ద్వారా నిర్ధారించవచ్చు. సాధారణంగా రక్తంలో చక్కెర శాతం 80 నుంచి 140 మి.గ్రా వరకు ఉంటుంది. ఇంత కన్నా ఎక్కువ ఉంటే చక్కెర వ్యాధి ఉన్నట్లే. ఖాళీ కడుపుతో ఉన్న ప్పుడు చక్కెర శాతం 60 నుంచి 90 ఎంజీ / డీఎల్, తిన్న తరువాత 110 నుంచి 140 ఎంజీ / డీఎల్ ఉండాలి. ఇంతకన్నా ఎక్కు వ ఉంటే చక్కెర వ్యాధి ఉన్నట్లే. చక్కెర వ్యాధికి ఆయుర్వేద మందులు కూడా ఉన్నాయి. భారతీయ ఆహారంలో తీపి, ఉప్పు, పులుపు, వగరు, చేదు, కారం లాంటి ఆరు రుచుల గురించి ప్రధానంగా పేర్కొన్నారు. ఆహారంలో తప్పని సరిగా ఆరు రుచులు ఉండాలన్నారు. చక్కెర వ్యాధిగ్రస్తులు కారం, వగరు, చేదు, రసాలు కలిగిన కూరగాయలు బాగా తీసుకోవలసి ఉంటుంది. శక్తిని ఇచ్చే అన్నం ఎక్కువగా తీసు కోకుండా, పొట్టు కలిగిన జొన్నరొట్టె, గోధుమ పుల్కాలు, సజ్జ రొట్టె తీసుకుంటే రక్తంలో చక్కెర శాతం పెరగకుండా ఉంటుంది. అలజడి, కోపం తగ్గించుకొని మానసిక ప్రశాంతత కలిగి ఉండాలి. యోగా, ధ్యానం, నడక లాంటివి చక్కెర వ్యాధి రాకుండా నిరోధిస్తాయి.

# నవభారత నిర్మాత పండిత నెహ్రూ

హిందూ స్త్రీల దాస్య విముక్తికి, సమానత్వ సాధనకు కృషిచేసి సంఘ సంస్కరణ కర్తగా, స్వతంత్ర భారతావని సాంప్రదాయాలు, విధానాల రూపశిల్పిగా, నవభారత నిర్మాతగా, పేరెన్నిక గన్నారు చాచా నెహ్రూ. వివాహం కనీస వయస్సును, 12 నుండి 15 కి పెంచడం, సతులు... పతుల నుండి విడాకులు తీసుకుని ఆస్తి వారసత్వ హక్కు పొందడం, వరకట్న పద్ధతిని చట్టవిరుద్ధం చేయడం, దేశ తొలి ప్రభుత్వాధినేతగా, సమాజ సంస్కరణలలో సఫలీకృతులయ్యారు, జవహర్ లాల్. న్యాయవాదిగా పరిపూర్ణ రాజకీయవేత్తగా, రచయితగా, దేశ స్వాతంత్ర్యానంతరం తొలి ప్రధానిగా, భారత రాజకీయాలను అత్యంత ప్రభావితం చేసిన నెహ్రూ – గాంధీ కుటుంబ అ మూలపురుషుడిగా సుపరిచితుడు అయిన నెహ్రూ, నేటి ఉత్తర ప్రదేశ్ లోని అలహాబాద్ నగరంలో కాశ్మీరీ బ్రాహ్మణ వంశంలో, ధనిక కుటుంబంలో, ప్రముఖ న్యాయవాది మోతిలాల్ నెహ్రూ, స్వరూప రాణిల తొలి సంతానంగా నవంబర్ 14, 1989లో జన్మించారు. సోదరీమణులైన కృష్ణ విజయలక్ష్మి పండిట్ లతో పాటు, "ఆనంద భవన్" లో ఆంగ్ల సాంప్రదాయ శిష్ట పద్ధతులలో పెరిగారు. బాల్యంలోనే హిందీ, సంస్కృతాలు, భారత సారస్వత గ్రంథాల పఠనా సక్తులు అయినారు. ఇండియన్ సివిల్ సర్వీసులో అర్హత పొందాలని తండ్రి కోరికను అనుసరించి, ఇంగ్లాండ్ నందలి హార్రో వెళ్ళాడు. పాఠశాల విద్య అక్కడ పూర్తిచేసి, 1907లో, కేంబ్రిడ్జ్ లో ప్రవేశ పరీక్ష రాసి, జీవశాస్త్ర అధ్యయనానికి కళాశాలకు వెళ్లి, 1910లో పట్టా పొందారు. అనంతరం న్యాయశాస్త్ర అ అధ్యయనానికి ఇన్నెర్ టెంపుల్ వెళ్లి, 1912లో ఉత్తీర్ణుడై అక్కడే న్యాయవాద వృత్తి చేపట్టాడు. వెనువెంటనే భారతదేశానికి తిరిగి రావడం జరిగింది. 1919లో జలియన్వాలా బాగ్ దుర్ఘటనకు ప్రభావితుడై, కాంగ్రెస్ ఆధ్వర్యంలో, దేశ స్వాతంత్ర్య సంగ్రామానికి ఆకర్షితుడై, సంగ్రామంలో తన శక్తులు లోడ్డుటకు ఉద్యుక్తుడయ్యాడు. మొదట మోతిలాల్ నెహ్రూ కుమారుని నిర్ణయాన్ని వ్యతిరేకించినా, తర్వాత ఆయన సైతం సంగ్రామంలో భాగస్వామి అయినాడు. అనంతరం మహాత్ముని నమ్మిన బంటుగా నెహ్రూ గుర్తింపు పొందాడు. ఆ సమయంలో 9 ఏళ్ళు జీవితం అనుభవించాడు. జీవితం సమయంలోనే 1334 లో "గ్లింప్సెస్ ఆఫ్ వరల్డ్ హిస్టరీ', 1936 లో తన జీవిత చరిత్ర 1946లో "ది డిస్కవరీ ఆఫ్ ఇండియా" రచనలు పూర్తిచేశాడు తొలిసారిగా గాంధీ నాయకత్వ పోరాటంలో, 1929 లో భారత జాతీయ కాంగ్రెస్ నేతగా, లాహోర్ సమావేశాలకు నాయకత్వం వహించాడు. 1936,1937,1940 లలో, జాతీయ కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నికైనాడు. యువకునిగా ఉన్న నాటి నుండే జాతీయ కాంగ్రెస్ లో, వామపక్ష భావజాల ప్రభావితుడై, సంపూర్ణ స్వాతంత్ర్య సముపార్జన ఆసక్తుడై, గాంధీ సలహాలతో, ప్రజాకర్షణ గల నేతగా, సంస్కరణవాదిగా స్వాతంత్ర్య సంగ్రామంలో ముఖ్య భూమిక నిర్వహించి గాంధీ అనంతరం, రెండవ అగ్రశ్రేణి నాయకుడిగా గుర్తించబడి నాడు. 1916లో కాశ్మీరీ బ్రాహ్మణ వంశస్థులు రాలైన కమలా కౌల్ తో వివాహితుడైన నాడు.

ఫలితంగా కుమార్తె ఇందిరా ప్రియదర్శిని 19 17 నవంబర్ 19న జన్మించింది. కమలా నెహ్రూ 19 46 లో క్షయ వ్యాధితో మృతి చెందగా, కుమార్తె ఇందిర, సోదరి విజయలక్ష్మిలపై, ఎక్కువగా ఆధార పడడం జరిగింది. 1947 నుండి 64 వరకు దేశ ప్రధానిగా ఉన్న నెహ్రూ, సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ గెలుపు లో ప్రధాన పాత్ర పోషించి, 1952 లో దేశ తొలి ప్రధాని గా ఎన్నుకొనబడినాడు. 1947 ఆగస్టు 15న స్వతంత్ర్య భారత పతాకాన్ని ఎగరవేసిన తొలి భారతీయుడిగా, గౌరవం దక్కించుకున్న ఘనత ఆయనది. పార్లమెంటరీ తరహాలో ప్రజాస్వామ్యం, లౌకికవాదం, స్వేచ్ఛావాదం, పేద అణగారిన వారి పట్ల అనురాగం, ప్రధానిగా ఆయన రూపొందించిన విధానాలపై ప్రభావం చూపాయి. 1964 మే 27న తన 74వ ఏట పరమపదించాడు. పంచశీల సూత్ర అనువర్తిగా, అలీనోద్యమ స్థాపకులలో ఒకరిగా, యుద్ధానంతర కాల అంతర్జాతీయ ప్రముఖుడిగా, గౌరవసూచకంగా "పండిట్" గా పిలువబడిన నెహ్రు, సుధీర్ఘ పదవీకాలం అనుభవాన్ని రంగరింప చేసుకున్న కూతురు ఇందిర, మనమడు రాజీవ్, ప్రధాని పదవులు పొందడానికి స్ఫూర్తి పొందా రనాడంలో, రవంతైనా అతిశయోక్తి లేదు.

# భారత్‌పై యుఎస్ టారీఫ్‌ల ఎఫెక్ట్

భారత ఎగుమతులపై అమెరికా సుంకాల ప్రభావం క్రమంగా పెరుగుతున్నది. దేశ జీడీపీ మీద, ఉత్పత్తి, ఉపాధి అవకాశాల ప్రభావం దేశంలోని కొన్ని కేంద్రాల్లో తీవ్రంగా ఉంది. అమెరికా సుంకాలు పది శాతంతో ప్రారంభమై ఆగస్టు 7 నాటికి 25 శాతం, ఆగస్టు 25 నాటికి 50శాతానికి చేరుకున్నాయి. వీటివల్ల గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ రిపోర్ట్ ప్రకారం 2025 మే నుండి సెప్టెంబర్ నాటికి అమెరికాకు మన దేశం చేసే ఎగుమతులు 37.5శాతానికి పడిపోయాయి. అమెరికాకు భారతదేశం ప్రతి సంవత్సరం సగటున 86.51 బిలియన్ డాలర్లు విలువ గల సరుకులను ఎగుమతులు చేస్తున్నది. ఇందులో 43శాతం అంటే 49.6 బిలియన్ డాలర్ల విలువ గల సరుకుల ఎగుమతులు పడిపోయాయి. వీటివల్ల అనేక రకాలుగా నష్టం జరిగింది. 2025 మేలో 8.8 బిలియన్ డాలర్ల విలువ గల సరుకులు ఎగుమతి చేస్తే, సెప్టెంబర్‌లో 5.5 బిలియన్ డాలర్లకు పడిపోయింది. దేశ జీడీపీలో 0.9శాతం తగ్గుదలకు అవకాశం ఏర్పడింది. జీడీపీ 6.5శాతం నుండి 5.6శాతానికి తగ్గే పరిస్థితి ఏర్పడింది. అమెరికాకు ఎగుమతులు తగ్గడంతో ఉత్పత్తి చేసే కంపెనీలలో సరుకులు గోడౌన్‌లలో మూలుగుతున్నాయి. సరుకు ఉత్పత్తిదారులు ఉత్పత్తిని తగ్గిస్తున్నారు. ఫలితంగా కార్మికులకు ఉపాధి తగ్గి ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. అంతిమంగా దేశంలో నిరుద్యోగం పెరగడానికి ఆర్థిక మందగమనం పెరగడానికి సంక్షోభానికి దారి తీసే పరిస్థితులు ఏర్పడ్డాయి. వీటి నివారణకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అమెరికాను ఎదిరించే దమ్ము లేక దేశ ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నది. అమెరికా సుంకాల వల్ల కీలక రంగాలు తీవ్ర నష్టాలకు గురవుతున్నాయి. మే నుండి సెప్టెంబర్ వరకు ఫార్మాస్యూటికల్ ఎగుమతులు 15.7శాతం పడిపోయాయి. వాటి విలువ సుమారు 745.6 మిలియన్ డాలర్ల నుండి 628.3 మిలియన్ డాలర్లకు తగ్గింది. ఇండిస్టియల్ మెటల్స్ ఆటో పార్ట్స్ ఇతరాలు ప్రపంచవ్యాప్తంగానే 16.7శాతం ఎక్స్‌పోర్ట్ తగ్గాయి. మన దేశం నుండి ఎగుమతయ్యే అల్యూమినియం ఎక్స్‌పోర్ట్ 37శాతం, కాపర్ 25శాతం, ఆటో పార్ట్స్ 12శాతం, ఐరన్ మరియు స్టీల్ 8శాతం ఎగుమతులు తగ్గాయి. ఉత్పత్తి రంగంలోని కార్మికులు ఉపాధి పొందుతున్న రంగాలలో వస్త్రాలు, రసాయనాలు, వ్యవ సాయ, ఆహార పరిశ్రమలు, యంత్రాలు, రత్నాలు, ఆభరణాలు రంగాల యొక్క ఎగుమతులు 33శాతం పడిపోయాయి. ఇందులో మే నెలలో 4.8 బిలియన్ డాలర్ల నుండి సెప్టెంబర్ నాటికి 3.2 బిలియన్ డాలర్లకు తగ్గాయి. రత్నాల ఆభరణాల ఎగుమతులు 59.2 శాతం తగ్గి సుమారు 500.2 మిలియన్ డాలర్ల నుండి 202.8 మిలియన్ డాలర్ల విలువ గల సరుకులు తగ్గి పోయాయి. ఆ మేరకు వియత్నాం, థారులాండ్‌లు అమెరికా ఆర్డర్స్ పొంది లాభపడ్డాయి. సోలార్ ప్యానల్స్ ఎగుమతులు కూడా 60.8శాతం పడిపోయాయి. అంటే సుమారు 202.6 మిలియన్ డాలర్ల నుండి 79.4 మిలియన్ డాలర్ల విలువ నష్టపోవడం జరిగింది. ప్రధానంగా స్మార్ట్ ఫోన్ ఎగుమతులు కూడా భారీగా తగ్గాయి. గత సంవత్సరం ఇదే కాలంలో 197శాతం ఎగుమతులు పెరిగితే, ఈ మే నుండి 58 శాతం పడిపోయాయి. 2.2 బిలియన్ డాలర్ల నుండి 884.6 మిలియన్ డాలర్లకు పడిపోయాయి. వీటన్నింటిని బట్టి మనకు అర్థమయ్యేదేమంటే అమెరికా ట్రంప్ సుంకాల వల్ల మన దేశం ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడింది. ఆర్థికంగా నష్టం జరిగింది.మన దేశం అమెరికాకు సుమారు 86 బిలియన్ డాలర్ల విలువగల సరుకులు ఎగుమతి చేస్తున్నది. ఈ సంవత్సరం 50 బిలియన్ డాలర్లకు తగ్గే అవకాశం ఉందని అంచనా వేయబడింది. ఈ ఐదునెలల్లో 4.36 లక్షల కోట్ల విలువ గల సరుకులు ఎగుమతి ఆగిపోయి దేశంపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. దేశంలో తయారీ, సేవల రంగాలు వాటి కార్యకలాపాలు తీవ్రంగా మందగిస్తున్నాయి. దాదాపు మూడు లక్షల ఉద్యోగాలు ప్రమాదంలో పడ్డాయి. ఇదేవిధంగా సుంకాలు కొనసాగితే టెక్స్‌టైల్, గార్మెంట్స్ రంగాలలో దాదాపు లక్ష ఉద్యోగాలు ప్రమాదంలో పడతాయి. రత్నాలు ఆభరణాలు, సుమారు 80 నుంచి 90 వేల మంది ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. సూరత్ ముంబై వాణిజ్య కేంద్రాలలో డిమాండ్, ప్రొడక్షన్స్ తగ్గాయి. తోలు పరిశ్రమలో 20 నుండి 30 వేల ఉద్యోగాలు, ప్రాసెస్ చేసిన ఆహారం, రొయ్యలు వంటి రంగాల్లో 20 వేలు, రసాయనాలు, ఔషధాలు, ఆటో విడిభాగాల వంటి వాటిలో 40 నుంచి 50 వేల ఉద్యోగాలకు ప్రమాదం ఏర్పడింది. చిన్న, మధ్యతరహా పరిశ్రమలలో పదివేల ఉద్యోగాలు పోతాయి. ఈ సుంకాల ప్రభావం వల్ల గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లోని ప్రధానమైన నగరాలలో వీటి ప్రభావం ఉంటుంది. ఇంత నష్టం జరుగుతున్నా మోడీ ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉంది. సుంకాల విధింపులకు కొద్ది నెలల ముందు ఫిబ్రవరిలో మోడీ అమెరికా పర్యటనలో 'మిషన్ 500' అని ఒప్పందం చేసుకొని 2030 నాటికీ 500 బిలియన్ డాలర్లు ఎగుమతి లక్ష్యంగా ప్రకటించింది. ఇదంతా జరగాలంటే రష్యాతో ఆయిల్ కొనరాదని, చైనాతో వ్యాపార సంబంధాలు ఉండరాదని, ముఖ్యంగా బ్రిక్స్ దేశాలలో సఖ్యత వాణిజ్యం తగ్గించుకోవాలని, డాలర్‌కు పోటీగా స్థానిక కరెన్సీలో వాణిజ్యం చేయరాదని అమెరికా కోరుకుంటున్నది. ముఖ్యంగా రష్యా, ఉక్రెయిన్ యుద్ధంలో భారత్ పరోక్షంగా పాల్గొంటుందని, రష్యాతో ఆయిల్ కొనడం వల్లే రష్యా యుద్ధం చేస్తున్నదని ఆరోపించింది. మన దేశం వీటిని ఖండించినా ప్రతిఘటించడం లేదు.చైనాపై వేసిన సుంకాలకు అమెరికాకు ధీటుగా జవాబు చెప్పి ప్రత్యామ్నాయంగా వేరే దేశాల్లో తన సరుకులు ఎగుమతి చేసుకొని లాభపడుతున్నది. చివరికి వియత్నాం, థారులాండ్ లాంటివి కూడా లాభపడ్డాయి. భారత్ తీవ్రంగా నష్టపోయింది. మన వాణిజ్య సంబంధాలు అమెరికా కన్నా రష్యాతో ఉండడం వల్ల మనకు లాభం కలిగింది. ఈ కాలంలో రష్యాలో ఆయిల్ కొనడం వల్ల మన దేశం చాలా లాభపడింది. 2025 సంవత్సరంలో రోజుకు రెండు మిలియన్ బ్యారెల్స్ ఆయిల్ దిగుమతి చేసుకున్నాము. మొత్తం చమురులో 40 శాతం ఇది. ఒక బ్యారెల్ మీద 15 నుండి 20 డాలర్లు డిస్కౌంట్ లభిస్తున్నది. ఈ సంవత్సరం 3.8 బిలియన్ డాలర్లు అదా చేసుకున్నాం. మొత్తంగా 2022 నుండి ఇప్పటివరకు 10 బిలియన్ డాలర్లు ఆదా అయింది. అంటే మన రూపాయలలో రూ.88,732 కోట్లు. ఇది భారతదేశ స్కూల్ ఎడ్యుకేషన్ బడ్జెట్ కన్నా రూ.10 వేల కోట్లు ఎక్కువే. తెలంగాణ బడ్జెట్‌లో 40శాతం అని చెప్పవచ్చు. రష్యాలో చమురు కొనడం వల్ల మనకు కలిగిన లాభం ఇది. ఈ సొమ్ము కూడా దేశ ప్రజలకు ఉపయోగపడడం కన్నా దేశంలోని అంబానీ లాంటి బడా పెట్టుబడుదారులకు లాభం కలిగింది. రష్యాతో వ్యాపారం వల్ల మిగిలిన సొమ్ములో ఒక రిలయన్స్‌కే 40శాతం వెళ్లింది. అంటే సుమారు 30 వేల కోట్లు లాభపడ్డారు. కానీ ఆయిల్, పెట్రోల్, డీజిల్ రేటు తగ్గించలేదు. ఇప్పటికే రష్యాతో చమురు దిగుమతులు తగ్గించుకోవడానికి అనేక రకాల ప్రయత్నాలు చేస్తున్నారు. అంబానీ కంపెనీలు చమురు దిగుమతులు తగ్గించుకోవడం లేదు. కానీ ప్రభుత్వరంగ సంస్థలు రష్యా నుండి చమురు దిగుమతి తగ్గించుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి చేస్తున్నది. ఐఓసీఎల్, హెచ్‌పిసిఎల్ అలాంటి ప్రయత్నాలలో ఉన్నాయి. రాబోయే కాలంలో ప్రభుత్వరంగ సంస్థలు నష్టాలకు గురై దివాలా తీసే పరిస్థితి ఏర్పడితే వాటిని బడా పెట్టుబడిదారులైన అంబానీకి, ఆదానీకి కట్టబెట్టే కుట్రలో ఇది భాగం. మరో పక్క చైనాతో వాణిజ్య సంబంధాలు ఈ కాలంలో మెరుగుపడ్డాయి. మన దేశానికి చైనా నుండి దిగుమతులు క్రమంగా పెరిగాయి. 2024– 25 సంవత్సరంలో 113.45 బిలియన్ డాలర్లు విలువ గల సరుకులు దిగుమతి చేసుకున్నాము. మన దేశం నుండి చైనాకు ఎగుమతులు మాత్రం 14.25 బిలియన్ డాలర్లు మాత్రమే ఉన్నాయి. రెండు దేశాల మధ్యన వాణిజ్య వ్యత్యాసం 100 బిలియన్ డాలర్ల ఉంది. మన ఎగుమతులు పెరిగితే మన ఆర్థిక వ్యవస్థకు లాభం కలుగుతుంది. చైనా మన ఎగుమతులను కూడా ఆహ్వానిస్తున్నది. చైనా మన దేశం సరుకులపై విధించే టారిఫ్‌లు 22శాతం ఉంది. కాబట్టి మనం చైనాకు ఎగుమతుల వల్ల ప్రయోజనం ఉంటుంది. చైనా, రష్యా తదితర బ్రిక్స్ దేశాలతో మనం కలిసి ఉండీ వ్యాపారం చేసుకుంటే మన దేశానికి ప్రయోజనం ఉంటుంది. మన ఉత్పత్తి రంగం దెబ్బ తినదు. ఉద్యోగాలు కోల్పోము. విదేశీ మారక ద్రవ్యం రూపంలో కూడా మిగులు ఉంటుంది. మన రూపాయి బలపడుతుంది. సరుకుల ధరలు తగ్గి ప్రజలకు లాభం కలుగుతుంది. ఇప్పుడు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం దేశం ముఖ్యమా? అమెరికా ప్రయోజనాలు ముఖ్యమా? అనేది తేల్చుకోవాలి.

# తెలంగాణ ముద్దుబిడ్డ విద్యాసాగర్ రావు

వలస పాలకుల స్వార్థ పాలనలో, సాగు నీటి రంగంలో జరిగిన అన్యాయాలు, ప్రాజెక్టుల్లో మోసంపై గణాంకాలతో తెలంగాణ జాతిని జాగృతం చేసిన గొప్ప వ్యక్తి విద్యాసాగర్ రావు. తెలంగాణకు నీటి విషయంలో జరిగిన మోసం, ,ప్రాజెక్టులపై జరిగిన అన్యాయంపై విద్యాసాగర్‌రావు చేసిన పోరాటం, అధ్యయనం అనన్య సామాన్యం. సాగునీటి రంగలో నిపుణులైన విద్యాసాగర్ రావు ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు నీటి కేటాయింపుల విషయంపై జరిగిన అన్యాయంపై ఎలుగెత్తి చాటారు. నీటిపారుదల శాఖలో వివిధ పదవులలో, హెూదా లలో పని చేసిన ఆయన, టీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి కేసీఆర్‌కు ప్రాజెక్టులు, నీటి కేటాయింపులపై ఎప్పటికప్పుడు సమాచారం, సలహాలు ఇస్తూ సందేహాలను నివృత్తి చేసేవారు. సాగునీటి రంగంలో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని ఆయన ఆధార సహితంగా, బహిర్గత పరిచి, ప్రజల్లో స్వరాష్ట్ర ఆకాంక్షను ప్రేరేపించడంలో, ఉద్యమ తెరాస పార్టీ అధినేతకు వెన్నుదన్నుగా ఉన్నారు. అలా కేసీఆర్‌కు ఉన్న అతి దగ్గర వ్యక్తులలో విద్యాసాగర్ రావు ఆంతరంగిక ముఖ్యులలో ఒకరై పోయారు. తెలంగాణ మలి దశ ఉద్యమంలో, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం తన పరి జ్ఞానంతో కొత్త ప్రాజెక్టుల రూప కల్పనలో ఆయన భాగస్వామ్యం విడదీయ జాలనిది, ఆయన పాత్ర నిజంగా మరువలేనిది.. "జయశంకర్ తర్వాత తెలంగాణ జాతికి దక్కిన మరో గొప్ప తెలంగాణ మహానుభావుడు విద్యాసాగర్ రావు" అని కేసీఆర్ చేత ప్రశంసింపబడ్డ తెలంగాణ ముద్దుబిడ్డ ఆయన. ఆర్. విద్యాసాగర్‌రావు (14 నవంబరు 1939 – 2017 ఏప్రిల్ 29) తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ జిల్లాకు చెందిన జాజిరెడ్డి గూడెం గ్రామానికి చెందిన లక్ష్మమ్మ, రాఘవరావు దంపతులకు విద్యా వంతుల కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న స్థితి, వారి కుటుంబంలో అందరికీ చదువుపట్ల ఆసక్తి కలగడానికి హేతువైంది. వారి గ్రామంలో తొలి సారిగా మెట్రిక్యులేషన్ చేసిన వ్యక్తి రాఘవరావు కాగా, మొదటి పట్టభద్రులు రాఘవరావు పెద్ద కుమారుడు, మొట్ట మొదటి ఇంజనీరింగ్ పట్టభద్రుడు విద్యాసాగర్‌రావు కావడం విశేషం. విద్యాసాగర్ రావు 1960లో హైదరాబాదు లోని ఉస్మానియా విశ్వ విద్యాలయము నుండి ఇంజనీరింగ్ లో పట్టభద్రు లయ్యారు. 1979 లో రూర్కీ విశ్వ విద్యాలయం (ప్రస్తుతం ఐఐటి రూర్కీ) లో నీటి వనరుల అభివృద్ధి లో మాస్టర్స్ డిగ్రీని పొందారు. ఆయన 1983లో అమెరికా లోని కొలోరాడో స్టేట్ విశ్వ విద్యాలయం నుండి నీటి వనరుల వ్యవస్థ ఇంజనీరింగులో డిప్లొమా పొందారు.ఆయన 1990లో ఢిల్లీ విశ్వ విద్యాలయం నుండి న్యాయ శాస్త్రంలో పట్టాను కూడా సంపాదించారు. బీటెక్ పూర్తి అయిన వెంటనే క్యాంపస్‌లోని మహిళా కాలేజీ మెయింటెనెన్స్ ఇంజినీరుగా ఉద్యోగంలో చేరారు.

కళల పట్ల ఆసక్తి కలిగిన ఆయన, ఉద్యోగంలో చేరిన తర్వాత కూడా రాయటం, నాటకాలు వేయడం వంటి హాబీ లకు దూరం కాలేదు. అను దినం సాయంత్రం విధుల నిర్వహణ అనంతరం రవీంద్ర భారతికి వెళ్ళేవారు. హైదరాబాద్‌లో ఉద్యోగం చేసి, అనంతరం ఢిల్లీకి వెళ్లారు. కేంద్రంలో మినిస్ట్రీ ఆఫ్ రైల్వేస్, నీటిపారుదల శాఖలో ఇంజనీరుగా పనిచేశారు. ఢిల్లీలో ఉన్న సమయంలో సాగునీటి విషయంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని తెలుసు కున్నారు. ఉద్యోగం నుండి విశ్రాంతి పొందాక, తరువాత తిరిగి హైదరాబాద్ వచ్చారు. దాదాపు 34 సంవత్సరాల పాటు కేంద్ర జల సంఘంలోనే విధులు నిర్వహించడంతో ఆయన దేశవ్యాప్తంగా జల వనరుల అంశంపై అపారమైన అనుభవం గడించారు. తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల విషయాలపై సమగ్ర అవగాహన, సరైన ఆలోచనను కలిగి ఉండేవారు. 2016 నవంబరులో కాకతీయ విశ్వ విద్యాలయంచే నిర్వహించబడిన "మిషన్ కాకతీయ" ప్రాజెక్టుకు సంబంధించిన సెమినార్ లో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఆయన ప్రసంగంలో వ్యవసాయ రంగంలో నీటి పారుదల ప్రాజెక్టులపై ప్రభుత్వ విధానాలను సమగ్రంగా వివరించారు. 2014లో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ (భారతదేశం) ఆయనను "లీడింగ్ ఇంజనీరింగ్ పెర్సనాలిటీస్ ఆఫ్ ఇండియా"గా గుర్తించి, పురస్కార గ్రహీత ను చేసింది. ఆయన ఎన్నో రచనలు చేశారు. పత్రికల్లో రాసిన వ్యాసాలన్నింటినీ కలిపి.. 'నీళ్లు–నిజాలు' పేరుతో పుస్తక రూపంలో ప్రచురించారు. అలా "నీళ్ళు నిజాలు విద్యాసాగర్ రావు"గా పేరెన్నిక గన్నారు. ఎన్. శంకర్ దర్శకత్వంలో వచ్చిన 'జై బోలో తెలంగాణ' చిత్రంలో ఉచిత పాత్రలో నటించారు. ఐక్యరాజ్య సమితి ఇన్విరాన్ మెంటల్ ప్రోగ్రామ్‌లో సభ్యుడిగా, సెంట్రల్ వాటర్ కమిషన్‌లో చీఫ్ ఇంజనీర్‌గా సేవలు అందించిన విద్యాసాగర్ రావు దేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొందారు. 12వ పంచవర్ష ప్రణాళిక రూపకల్పన లోనూ సలహాలు అందించారు. సాగునీటి రంగ రిటైర్డ్ చీఫ్ ఇంజినీరుగా, తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల సలహాదారుగా సుపరిచితులు అయిన విద్యా సాగర్‌రావు రచయితగా, నటునిగా చూపిన ప్రతిభ గురించి చాలా మందికి తెలియదు. గిరీషం కలం పేరుతో ఆయన రాసిన రచనలు అనేక పత్రికల్లో ప్రచురించారు. బాల్యంలో కవి సమ్మేళనాలు, నాటకాల ప్రదర్శనలకు వెళ్లేవారు. కాలేజ్ స్థాయి వివిధ పోటీల్లో పాల్గొని, నాటకాలు కూడా వేసేవారు. కొంత కాలం అనారో గ్యానికి గురై, 2017 ఏప్రిల్ 29న హైదరాబాద్‌లో దివంగతులైనారు.

# దేశభద్రత మాటలకే పరిమితమా!

ఢిల్లీ రెడ్ ఫోర్ట్ మెట్రో స్టేషన్ సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడు దేశ ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయిన ఈ ఘటన మరోసారి భారతదేశ భద్రతా వ్యవస్థల లోపాలను వెలుగులోకి తెచ్చింది. స్వాతంత్ర్యానంతర చరిత్రలో మతాధారిత విభజనల వలన, ఓటు బ్యాంకు రాజకీయాలు ప్రాబల్యం వల్ల ఉగ్రవాదం భారతదేశంలో పునరావృతం అవుతూనే ఉంది. దేశ సమైక్యత, సార్వభౌమాధి కారం, భద్రత వంటి అంశాలు ఇప్పుడు పక్కకు పడిపోతున్నాయి. ఈ పరిస్థితి మారాలంటే ప్రజల్లో 'ఈ దేశం నాది' అనే భావన పునరుద్ధరించుకోవాలి. భారతదేశం చవిచూసినన్ని తీవ్రవాద దాడులను ప్రపంచంలో మరే దేశం ఎదుర్కోలేదంటే అతిశయోక్తి కాదేమో! స్వాతంత్రోద్యమ తర్వాతి చరిత్రను క్షుణ్ణంగా పరిశీలిస్తే.. దేశాన్ని మతం ఆధారంగా విభజన చేయాలని విభజన శక్తులు 1946లో 'డైరెక్ట్ యాక్షన్' పిలుపుతో సృష్టించిన నరమేధం ఈ దేశంలో సంభవించిన మొదటి మత ఉగ్రవాద దాడిగా పరిగణించాలి. అసలు భారత దేశంలో తీవ్రవాద దాడులు ఎందుకు జరుగుతున్నాయి? దేశంలోని ఓటు బ్యాంకు రాజకీయాలు, కులవాద రాజకీయాలు, కుల రిజర్వేషన్లు, ఉచిత హామీల పథకాలు, దోపిడీ తత్వం ప్రథమ ప్రాధాన్యతలో చేరిపోయాయి. దేశసమైక్యత, సమగ్రత, దేశ సార్వభౌమాధికారం, శాంతి భద్ర తలు అప్రధాన విషయాలుగా మారిపోయాయి. తీవ్ర వాద కార్యకలాపాలలో పాల్గొన్న వారిని కఠినంగా శిక్షిస్తే వారికి సంబంధించిన అనుయాయులు ఎక్కడ బాధపడతారో అనే మానసిక దౌర్బల్యం బీజేపేతర ప్రతిపక్ష నాయకులను పట్టి పీడిస్తోంది. జమ్మూ కశ్మీర్‌లో, కశ్మీర్ వేర్పాటువాద నాయకులు, పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు కలిసి ఆ లోయలో సృష్టించిన మారణ హెూమం భారతదేశ చరిత్రలో చీకటి అధ్యాయం! ఆ లోయలో ఏర్పడిన భయంకరమైన పరిస్థితులను తట్టుకోలేక మూడు లక్షల మంది కశ్మీరీ హిందువులు అక్కడి నుంచి పారిపోయి వచ్చి కాందిశీ కులుగా బతుకుతున్నారు. ప్రజాస్వామ్య దేశంలో మెజారిటీ సమాజానికి చెందిన ప్రజలు కాందిశీకులుగా బతకడం ఒక వైచిత్రి. ఇలాంటి పరిస్థితి ప్రపంచంలో ఏ దేశంలో కూడా సంభవించదు! మేధావులమని చెప్పుకునే వారికి పాలస్తీనా ముస్లింల కష్టాలు కనబడతాయి కానీ కశ్మీరీ కాందిశీకుల కడగండ్లు కనిపించవు.

దేశంలో అనేక చోట్ల భారీ ఉగ్రదాడికి పాల్పడాలని ప్రయత్నించిన ఎనిమిది మందిని నిఘా వర్గాలు అరెస్టు చేయడం, వారి నుండి 2009 కేజీల పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకోవడం దేశ ప్రజలను భయకంపితులను చేసింది. అరెస్టయిన ఎనిమిది మందిలో నలుగురు డాక్టర్లు ఉండడం, ఆ నలుగురు డాక్టర్లలో ఒక మహిళ ఉండడం బట్టి చూస్తే, దేశం ఎంత ప్రమాదకర పరిస్థితుల్లో ఉందో అర్థమవుతుంది. ఈ దేశంలో తీవ్రవాద కార్యకలాపాలకు ఈ దేశంలోని రాజకీయ నాయకులు, కొన్ని జాతి వ్యతిరేక సంస్థల ప్రతినిధులు ప్రత్యక్ష, పరోక్ష సహకారం ఎలా అందిస్తున్నారో కొన్ని సంఘటనలు పరిశీలిస్తే అర్థమవుతుంది. ఢిల్లీ బాట్లా ఎన్కౌంటర్‌లో హతమైన ఉగ్రవాదికి కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ సంఘీభావం తెలపడం, పార్లమెంటుపై దాడి కేసులో నిందితులైన దోషులకు శిక్షను ఆపించడానికి భారత సుప్రీంకోర్టును అర్ధరాత్రి తెరవడం, ముంబై వరుస బాంబు పేలుళ్ల నిందితు లను కాపాడడానికి రిటైర్ అయిన ఒరిస్సా రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి మురళీధరన్‌ని అడ్వకేట్‌గా నియ మించి, దోషులను విడిపించడం, తాజ్ హెూటల్ దాడి జరుగుతున్న సమయంలో స్పెషల్ కమాండోలను సరైన సమయంలో దించకుండా కేంద్ర హెూం శాఖ ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడడం ఇందుకు కొన్ని తార్కాణాలు. తీవ్రవాద కార్యకలాపాల వల్ల దేశానికి ఎలాంటి నష్టం జరుగుతుందో దేశ ప్రజలకు వివరించడంలో జాతీయ వాదులమని చెప్పుకునే వారిలో ఒక నిర్దిష్టమైన ప్రణాళిక, వ్యూహం లేదని ఒప్పుకోవాలి. ప్రతీ తీవ్రవాద సంఘటనకు పాకిస్తాన్ కారణమని చెప్పడం వీరికి పరిపాటి అయింది. ఇందుకు వాస్తవమైన కారణాలను వెదికి దేశ ప్రజలకు వివరించాలి. దేశ ప్రజలను తమ వైపుకు తిప్పుకునే ప్రయ త్నాలు చేయాలి. ఇక చివరగా దేశ భద్రతకు, దేశ సమగ్రతకు, శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా ఎవరు ప్రవర్తించినా కఠిన చర్యలు తీసుకునే పాలన వ్యవస్థ, అందుకు సహకరించే న్యాయవ్యవస్థ ఈ దేశంలో ఏర్పడనంత వరకు ఢిల్లీ పేలుళ్ల లాంటి సంఘటనలు ఈ దేశంలో జరుగుతూనే ఉంటాయి. ఇలాంటి వ్యవస్థలు ఏర్పడాలంటే ఈ దేశ ప్రజలలో 'ఈ దేశం నాది' అనే భావన నిర్మాణం కావలసిన అవసరం ఎంతైన ఉంది!



# వైవిధ్యమైన కథ..

ఖుషి టాకీస్ పై నిర్మించిన 'సీత ప్రయాణం కృష్ణతో' సినిమా ఈనెల 14న రిలీజ్ కానుంది. రోజా భారతి, దినేష్, సుమంత్, అనుపమ తదితరులు నటించిన ఈ చిత్రానికి దేవేందర్ దర్శకుడు. ఈస్ట్ వెస్ట్ ఎంటర్టైన్మెంట్స్ ప్రెజెంటర్‌గా డా.రాజీవ్, డా. రోజా భారతి నిర్మించారు. సినిమా విడుదల నేపథ్యంలో హీరోయిన్ డా.రోజా భారతి మాట్లాడుతూ, 'నన్ను నమ్మి అందరూ ఈ సినిమా నాది అని అనుకుని పని చేసారు. కాబట్టే ఇవాళ రిలీజ్ వరకు రాగలిగాం. అందరు 14న మా సినిమాని చూసి ఆదరిస్తారని ఆశిస్తున్నాను' అని తెలిపారు. 'నాకు సినిమాలో అవకాశం ఇచ్చిన రోజా, రాజీవ్‌కి చాలా థ్యాంక్స్. వాళ్లిద్దరూ లేకపోతే ఈరోజు మేము ఇక్కడ ఇలా ఉండి మాట్లాడలేము. కచ్చితంగా మా సినిమా అందరిని ఎంటర్టైన్ చేస్తుందని నమ్ముతున్నాను' అని హీరో దినేష్ చెప్పారు. హీరోయిన్ రాఖి శర్మ మాట్లాడుతూ, 'ఈ చిత్రంలో రాధికా అనే క్యారెక్టర్‌లో నటించాను. నాకు ఈ రోల్ చాలా స్పెషల్' అని తెలిపారు. డా.రాజీవ్ మాట్లాడుతూ,'ఈ సినిమా మాకు చాలా సెంటిమెంట్. సినిమాలో నటించి, ప్రొడ్యూసర్‌గా డా. రోజా భారతి మాకు ఇచ్చిన సపోర్ట్ మరువలేనిది' అని చెప్పారు. 'మా సినిమాని అన్ని తానై మోసిన రోజా భారతికి ఎప్పుడూ రుణపడి ఉంటాను. ఓ డిఫరెంట్ కాన్సెప్ట్‌తో ఈ సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం' అని డైరెక్టర్ దేవేందర్ అన్నారు.

# ఇది చాలా అరుదైన సినిమా..



దుల్కర్ సల్మాన్ మోస్ట్ ఎవైటెడ్ పీరియాడికల్ డ్రామా 'కాంత'. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్ కాగా.. రానా, సముద్రఖని కీలక పాత్రలు పోషిస్తున్నారు. దుల్కర్ సల్మాన్ 'వేఫేర్ ఫిలిమ్స్ ప్రైవేట్ లిమిటెడ్', రానా దగ్గుబాటి 'స్పిరిట్ మీడియా' సంయుక్తంగా నిర్మిస్తున్నారు. నవంబర్ 14న గ్రాండ్ థియేట్రికల్‌కి సిద్ధం అవుతున్న ఈ చిత్రంపై ఆసక్తికర కామెంట్స్ చేశాడు రానా. 'ఇది కంప్లీట్‌గా ఫిక్షనల్ కథ. ఇప్పుడు స్టూడియోలో ఏదైనా జరిగితే ఇమ్మీడియట్‌గా అందరికీ తెలిసిపోతుంది. కానీ ఇలాంటి కథలు చాలా జరిగాయి. చాలా తక్కువ మందికి తెలిసేవి. ఆ కాలం నుంచి ఇన్స్పిరేషన్ పొంది రాసిన కథ. ఇది ఒక ఇన్సిడెంట్ అని చెప్పలేం. డార్క్ సైడ్ ఆఫ్ గ్రేట్ పీపుల్ అని చెప్పొచ్చు. ఒక ఇద్దరు గొప్ప వ్యక్తులు వాళ్ళ ఆర్టిస్ట్ బ్రిలియన్స్ కోసం గొడవలు పడిన నేపథ్యం చాలా ఆసక్తికరంగా ఉంటుంది. 50%o% బ్యాక్ డ్రాప్‌ని ఎంచుకోవడానికి కారణం ఏంటంటే.. ఆ కాలంలో లిటరేచర్, మ్యూజిక్‌కి చాలా ఎక్కువ ప్రాముఖ్యత ఉండేది. ఈరోజు షార్ట్ కాంటెంట్‌లో ఉన్నాం.. ఏ మ్యూజిక్ ఏ సాహిత్యమైన ఓకే అన్ని సర్దుకుపోతున్నాం. కానీ ఆ కాలంలో అలా ఉండేది కాదు. పర్ఫెక్షన్ ఉండేది. ఆ టైంలో జరిగిన కథ అంటే తెలియని రొమాన్స్ వస్తుంది. కాంత నా కెరియర్లో చాలా స్పెషల్ ఫిలిం. ఇలాంటి సినిమాలు జీవితంలో ఒకేసారి వస్తాయి. ఇలాంటి ఎక్స్‌పీరియన్స్‌ని మళ్ళీ మళ్ళీ రీ క్రియేట్ చేయలేం. నేను కథ విన్న వెంటనే కచ్చితంగా సినిమా చేయాలనుకున్నాం. కాంత సినిమాని రియల్‌గా సెలబ్రేట్ చేసుకునేలా ఉంటుంది. ఇందులో ఉండే డ్రామా ఎమోషన్ అద్భుతంగా ఉంటాయి. ఇందులో ఉండే డ్రామా ఎమోషన్

## ఎమోషనల్‌గా ఆకట్టుకునే సాంగ్





విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా నటిస్తున్న సినిమా 'సంతాన ప్రాప్తిరస్తు'. మధుర ఎంటర్‌టైన్మెంట్, నిర్వి ఆర్ట్స్ బ్యానర్స్ పై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్న ఈ మూవీకి సంజీవ్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నాడు. పాజిటివ్ ఎక్స్‌పెక్టేషన్స్ మధ్య ఈ సినిమా ఈ నెల 14న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. దీంతో ప్రమోషన్స్‌లో జోరు పెంచిన చిత్ర బృందం మూవీ నుంచి వరుస అప్డేట్స్ ఇస్తూ సందడి చేస్తున్నారు. ఇందులో భాగంగానే తాజాగా 'మరి మరి..' లిరికల్ సాంగ్ రిలీజ్ చేశారు. ఉమా వంగూరి లిరిక్స్ అందించిన ఈ పాటను సునీల్ కశ్యప్ కంపోజ్ చేశారు. ప్రముఖ సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్ పాడారు. 'మరి మరి నిన్ను వెతికేలా.. మరవదు ఓ క్షణమైనా.. మనసంతా నీ తలపులే.. ప్రతి చోటా నీ గురుతులే.. వేచా గడిచిన నిన్నల్లో.. వెతికా నడిచిన దారుల్లో.. వెలుగే విడిచిన నీడల్లో.. వదిలి వెళ్లిన జాడల్లో...' అంటూ ఎమోషనల్ బీట్‌తో సాగిన ఈ సాంగ్ ప్రజెంట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఇందులో.. వెన్నెల కిషోర్, తరుణ్ భాస్కర్, అభినవ్ గోమటం, మురళీధర్ గౌడ్, హర్షవర్ధన్, బిందు చంద్రమౌళి, జీవన్ కుమార్, సత్య కృష్ణ, తాగుబోతు రమేష్, అభయ్ బేతిగంటి, కిరీటి, అనిల్ గీల, సద్దామ్, రియాజ్, తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

## నా స్వార్థంతో నిన్ను
# ప్రమాదంలో పెట్టా..



అక్కినేని నాగార్జున, ఆర్జీవీ కాంబోలో 1998లో వచ్చిన 'శివ' బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచింది. అమల హీరోయిన్‌గా జేడీ చక్రవర్తి కీలక పాత్రలో నటించిన ఈ సినిమా అప్పట్లో బాక్సాఫీసు వద్ద పెద్ద సంచలనమే సృష్టించిన విషయం తెలిసిందే. మళ్లీ 36 ఏళ్ల తర్వాత 'శివ' మూవీ నవంబర్ 14న రీరిలీజ్ కాబోతుంది. ఇప్పటికే ఇందులోంచి వచ్చిన ట్రైలర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇక ప్రమోషన్స్‌లో భాగంగా ఆర్జీవీ, నాగార్జున పలు విషయాలను ప్రేక్షకులతో పంచుకుంటున్నారు. తాజాగా, రామ్ గోపాల్ వర్మ 'శివ'లో నటించిన నటికి క్షమాపణలు చెప్తూ పెట్టిన పోస్ట్ వైరల్‌గా మారింది. ఆమె మరెవరో కాదు.. శివ మూవీ చైల్డ్ ఆర్టిస్ట్ సుష్మ. ఇందులో భవానీ గ్యాంగ్.. నాగార్జునను చేజ్ చేస్తుండగా.. నాగ్ ఓ చిన్న పాపను సైకిల్‌పై కూర్చోబెట్టుకుని వేగంగా వెళ్తాడు. ఇంతలో యాక్సిడెంట్ అయి ఇద్దరు కిందపడిపోతారు. అప్పుడు పాపను ఎత్తుకుని నాగ్ గూండాలతో ఫైటింగ్ చేస్తుంటాడు. అయితే ఆ పాప ఈ సినిమాలో నాగ్ అన్న కూతురిలా నటిస్తుంది. ఇక ఈ సీన్ గురించి ఆర్జీవీ తన తప్పు 36ఏళ్ల తర్వాత అర్థమైనట్లు తెలుపుతూ.. "సైకిల్ చేజ్ సీన్‌లో ఉంది ఈ చిన్నారే సుష్మ. అమెరికాలో ఏఐ, కాగ్నిటివ్ రీసెర్చ్ చేస్తోంది. సుష్మ నువ్వు చాలా సాహసోపేతమైన సన్నివేశాల్లో నటించావు. అప్పుడు ఆ సీన్ ఎంత ప్రమాదమనేది నాకు అర్థం కాలేదు. దర్శకుడిగా నా స్వార్థం చూసుకుని ఇలాంటి ప్రమాదకరమైన షాట్స్ తీశాను. అందుకు నన్ను క్షమించు. నాకు నా తప్పు ఇప్పుడు అర్థం అయింది" అని రాసుకొచ్చాడు. అలాగే చైల్డ్ ఆర్టిస్ట్‌గా చేసిన సుష్మ ఇప్పుడెలా ఉందో ఫొటోను కూడా షేర్ చేశాడు. ఇక అది చూసిన నెటిజన్లు షాక్ అవుతూ.. నువ్వు క్షమాపణలు చెప్పావా అని పలు రకాలుగా కామెంట్లు పెడుతున్నారు.

## నన్ను ఎవడైనా
# గెలికితే అంతే!



'ది గర్ల్‌ఫ్రెండ్' సక్సెస్ మీట్ సందర్భంగా హీరో విజయ్ దేవరకొండ హాట్ కామెంట్ చేశారు. ఇండస్ట్రీలో తనను ఎవరైనా గెలికితే, మామూలుగా ఉండదని వార్నింగ్ ఇచ్చారు విజయ్ దేవరకొండ. వాళ్లకు రివర్స్‌గా తాను వ్యవహరిస్తానని హెచ్చరించారు. అయితే హీరోయిన్ రష్మిక తన లాగా కాదని, చాలా క్యూట్ అంటూ ప్రశంసించారు. 'ది గర్ల్‌ఫ్రెండ్' మూవీ సక్సెస్ మీట్ నిన్న జరుగగా స్పెషల్ గెస్ట్ గా విజయ్ దేవరకొండ పాల్గొని మాట్లాడారు. కెరీర్ పీక్స్ లో ఉన్న సమయంలో 'ది గర్ల్‌ఫ్రెండ్' లాంటి కథలు ఎంచుకోవడం చాలా గొప్ప విషయమని వివరించారు. రష్మిక జర్నీని చూస్తే చాలా గర్వంగా ఉంటుందన్నారు. నిజ జీవితంలో కూడా ఆమె భూమా దేవినే అంటూ వ్యాఖ్యానించారు. ఎవరెన్ని మాటలు అన్నా కూడా, వాటిని లెక్కచేయదని తెలిపారు. వాటిని పట్టించుకోకుండా కెరీర్ పైన దృష్టి పెట్టి ముందుకు వెళుతుందని పొగిడారు విజయ్ దేవరకొండ. ఇక ఈవెంట్ ప్రారంభాని కంటే ముందు రష్మికను చూడగానే ఆమె చేతిపై కిస్ పెట్టారు విజయ్ దేవరకొండ. దీనికి సంబంధించిన ఫోటోలు, వీడియోలు వైరల్ గా మారాయి. దీంతో ఈ జంట త్వరలోనే పెళ్లి చేసుకోబోతుందని, అందుకే విజయ్ కిస్ ఇచ్చి హింట్ ఇచ్చినట్లు సోషల్ మీడియాలో కామెంట్లు పెడుతున్నారు.

## ప్రేమ జంట మధ్యలోకి
# పోలీస్ ఆఫీసర్ ఎంట్రీ




'కలర్ ఫొటో' ఫేమ్ సందీప్ రాజ్ దర్శకత్వంలో రాబోతున్న లేటెస్ట్ మూవీ 'మోగ్లీ'. రోషన్ కనకాల, సాక్షి మడోల్కర్ జంటగా నటిస్తున్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ మూవీ నుంచి ఇప్పటికే వచ్చిన పోస్టర్స్, టీజర్, ట్రైలర్ మంచి రెస్పాన్స్‌ను సొంతం చేసుకోగా.. తాజాగా టీజర్ రిలీజ్ చేశారు మేకర్స్. 'కొన్ని కథలు చెప్పడానికే ఉంటాయి.. ఇది అనుభూతి చెందడానికి.. ఒక నిశ్శబ్ద ప్రేమకథలోని అత్యంత పెద్దా వార్‌ను అనుభవించడానికి సిద్ధంగా ఉండండి' అంటూ షేర్ చేసిన ఈ లో ప్రేమ కోసం ఎంత దూరమైనా వెళ్లే యువకుడిగా రోషన్ కనకాల కనిపించి మెప్పించాడు. ఇక అతడు ప్రేమించే అమ్మాయిగా సాక్షి మడోల్కర్ అలరించనుంది. ఇలా అడవి నేపథ్యంలో సాగే వీరి క్యూట్ ప్రేమ కథలో రావణుడి లాంటి ఓ పోలీస్ ఆఫీసర్ ఎంట్రీ ఇవ్వడం ఆసక్తిని క్రియేట్ చేసింది. ఈ క్రమంలోనే తనకు ఎదురయ్యే సమస్యలను హీరో ఎలా ఎదుర్కొంటాడు.. తన ప్రేమను ఎలా గెలిపించుకుంటాడు అనే దానిపై ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ నెలకొంది. మొత్తంగా ఈ టీజర్‌తో సినిమాపై మరింత హైప్ క్రియేట్ అయింది. కాగా.. భారీ అంచనాల మధ్య ఈ మూవీ డిసెంబర్ 12న రిలీజ్ అయ్యేందుకు సిద్ధంగా ఉంది.

### వాకింగ్‌కు వెళ్లిన విద్యుత్ శాఖ

## కార్మికుడికి గుండెపోటు మృతి

ఆసిఫాబాద్, : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలానికి చెందిన పర్చాకి మారుతి (38) గురువారం ఉదయం వాకింగ్‌కు వెళ్లి గుండెపోటుతో మృతిచెందాడు. విద్యుత్ శాఖ పరిధిలోని మంగి ఫీడర్లో కాంట్రాక్టర్ కార్మికుడిగా పనిచేస్తున్న మారుతి, ప్రతిరోజు లాగే ఉదయం వాకింగ్‌కు వెళ్లి తిరిగి రాలేదు. భార్య విజయలక్ష్మి వెతుకుతూ వెళ్లగా, మార్గమధ్యంలో పడిపోయి ఉన్నట్టు గుర్తించారు. తక్షణమే తిర్యాణి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు.

## ఆదిలాబాద్‌లో యువకుడి సూసైడ్

సిర్పూర్, : ఆదిలాబాద్‌లోని బొక్కలగూడ కాలనీకి చెందిన యువకుడు మొహమ్మద్ మైసన్ చౌష్ ఉరేసుకుని సూసైడ్ చేసుకున్నాడని స్థానికులు తెలిపారు. ఫ్రిడ్జ్ మెకానిక్‌గా పని చేసే అతడు గురువారం ఉదయం ఈద్గా గోడ వెనుక ఉన్న చెట్టుకు ఉరేసుకున్నాడన్నారు. అటువైపు వెళ్లిన స్థానికులు వేలాడుతున్న మృతదేహాన్ని గమనించి ఈద్గా నిర్వాహకులకు సమాచారం అందించారు. శవాన్ని పోలీసులు రిమ్స్‌కు తరలించారు. దర్యాప్తు చేశామని టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు.

### బాధిత కుటుంబాన్ని పరామర్శించిన

## ఎమ్మెల్యే కోవ లక్ష్మి



మంచిర్యాల,: రెబ్బెన పీఏసీఎస్ వైస్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు రంగు మహేష్ గౌడ్ తండ్రి రంగు వెంకటి గౌడ్ మరణం పట్ల ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి సంతాపం తెలిపారు. గురువారం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి, వారిని ఓదార్చి, ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్ రెడ్డి, బొమ్మినేని శ్రీధర్, గజ్జల సత్యనారాయణ, దుర్గం భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

## రణరంగాన్ని తలపించిన పోడు రైతుల అరెస్టు

బెల్లంపల్లి, : దండేపల్లి మండలం దమ్మన్నపేటకు చెందిన పోడు రైతులను అరెస్టు చేసేందుకు అటవీ అధికారులు చేసిన ప్రయత్నం సందర్భంగా గిరిజనులు తిరగబడటంతో పరిస్థితి రణరంగాన్ని తలపించింది. పలువురు అధికారులు, గిరిజనులు గాయపడ్డారు. దండేపల్లి తహసీల్దార్‌కు మేము వినతి పత్రం ఇవ్వడానికి వెళ్తే లక్షెట్టిపేట అటవీ క్షేత్ర కార్యాలయానికి డీఎఫ్‌వో వస్తున్నారని.. వారితో చెప్పి సమస్య పరిష్కరించుకోవాలని చెప్పి అటవీ శాఖ అధికారులు తమను నమ్మించి అరెస్టు చేశారని ఆదివాసీలు ఆరోపించారు. మాకు జీవనాధారం చూపాలని, కేసులు లేకుండా చూడాలని అన్నారు

### ఉత్సాహంగా జోనల్ స్థాయి క్రికెట్ ఎంపిక పోటీలు

చెన్నూరు, : జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని క్రీడా ప్రాంగణంలో గురువారం అండర్–19 బాలుర జోనల్ స్థాయి (ఉమ్మడి జిల్లా) క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు ఉత్సాహంగా సాగాయి. ముఖ్య అతిథిగా జిల్లా మాధ్యమిక విద్యాధికారి గణేష్ హాజరై మాట్లాడారు. దేశంలోనే క్రికెట్ ఆట అత్యంత ప్రాచుర్యం పొందిందని పేర్కొన్నారు. ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీనివాస్, అండర్ 19 ఉమ్మడి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి బాబురావు, ఎన్.ఐ.ఎస్. క్రికెట్ కోచ్ జయేంద్ర పటాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## 248 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ

పెద్దపల్లి,: గురువారం హుజురాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ రేగొండ మండలంలోని జిల్లా పరిషత్ హైస్కూళ్లు, కేజీబీవీ, ఎంజెపీలలో పదో తరగతి, ఇంటర్మీడియట్ చదువుతున్న 248 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను అందించింది. ట్రస్టు నిర్వాహకులు గంగిశెట్టి జగదీశ్వర్, ఎంజెపీ ప్రిన్సిపాల్ ఏ అపర్ణ, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ జి మనోరమ, మండల విద్యాధికారి ప్రభాకర్ చేతుల మీదుగా ఈ ప్యాడ్లను విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, రిటైర్డ్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ డి సురేష్ బాబు పాల్గొన్నారు.

### కాన్సెప్ట్ సినిమాలకు

## 50 శాతం రాయితీ కల్పించాలి

జగిత్యాల,: పర్యావరణాన్ని కాపాడాలనే కాన్సెప్ట్‌తో తీసిన 'కలివి వనం' సినిమాను మాజీ మంత్రి జీవన్ రెడ్డి అభినందించారు. ఇలాంటి కాన్సెప్ట్‌తో తీసిన సినిమాలకు 50 శాతం రాయితీ ఇవ్వాలని ఆయన సూచించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో 'కలివి వనం' సినిమా దర్శకుడు రాజ్ నరేంద్ర, మాజీ మంత్రి జీవన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి రాజ్ నరేంద్రను శాలువాతో సన్మానించారు.

## పార్లమెంటులో రాజ్యాంగ సవరణకు డిమాండ్

ధర్మపురి, : బీసీ జేఏసీ ఆదేశాల మేరకు, రిజర్వేషన్లు తమ హక్కు అని, బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు పార్లమెంటులో రాజ్యాంగ సవరణ చేయాలని డిమాండ్ చేస్తూ మానకొండూరు మండల కేంద్రంలో బీసీల ధర్మ పోరాట దీక్ష కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు. రిజర్వేషన్లు ఎవరో ఇచ్చే బిక్ష కాదని, అది తమ హక్కు అని వారు స్పష్టం చేశారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

కోరుట్ల, : ఇబ్రహీంపట్నం మండలానికి చెందిన 278,000 రూపాయల విలువైన 11 సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ గురువారం లబ్ధిదారులకు మండల కేంద్రంలోని రైతు వేదికలో అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిరుపేదల వైద్య ఖర్చులకు సీఎం సహాయ నిధి ద్వారా ఆదుకునేవారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో నిరుపేదలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు.

## బీటీ రోడ్డు పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే

రామగుండం, : పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం గోదావరిఖనిలోని జనగామ ప్రాంతంలో గురువారం రూ. 45 లక్షల వ్యయంతో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జనగామ ప్రాంత అభివృద్ధికి రూ. 3 కోట్లతో రోడ్ వెడల్పు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో

## విజిలెన్స్ అధికారుల తనిఖీలు

మంథని, : కరీంనగర్ రీజినల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో సీఐలు వరుణ్, అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు పలు రికార్డులతోపాటు వ్యాపార లావాదేవీలు, ట్రేడింగ్‌కు సంబంధించిన వివరాలను పరిశీలించారు. కొన్నేళ్లుగా జరిగిన లావాదేవీలు, రికార్డులకు సంబంధించిన పూర్తి వివరాలను పరిశీలిస్తున్నట్లు సీఐలు తెలిపారు.

## ఖమ్మం కలెక్టరేట్ వద్ద తీవ్ర ఉద్రిక్తత

భద్రాచలం, : ఖమ్మం కలెక్టరేట్ వద్ద గురువారం రైతులు, రైతు సంఘం నేతలు తీవ్ర ఉద్రిక్తతకు దారితీసే నిరసన చేపట్టారు. రైతులు పండించిన వరి ధాన్యం, పత్తి, మొక్కజొన్న తక్షణమే కొనుగోలు చేయాలని, మండలాల వారీగా సీసీఐ, ఐకెపి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఏఐకేఎంఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లతో రైతులు కలెక్టరేట్ లోనికి చొచ్చుకొని వెళ్లడంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది.

### గ్యాస్ సిలిండర్ ఉపయోగించే

## విధానంపై అవగాహన



పినపాక, : గురువారం, పినపాక ఫైర్ స్టేషన్ సిబ్బంది షాపు యజమానులకు ఫైర్ ఎగ్జాస్టింగ్ గ్యాస్ సిలిండర్లను ఆపద సమయంలో ఎలా ఉపయోగించాలో అవగాహన కల్పించారు. ఫైర్ స్టేషన్ ఎస్ఐ పి. వినోద్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో, ఈ సిలిండర్లు అగ్నిని త్వరగా, సమర్థవంతంగా ఆర్పడానికి ఉపయోగపడే ప్రత్యేక పరికరాలని వివరించారు.

## వైరా ఆసుపత్రి సమస్యలపై సీపీఎం ఆందోళన

కొత్తగూడెం, : వైరా నియోజకవర్గంలోని వంద పడకల ఏరియా ఆసుపత్రి సమస్యలతో సతమతమవుతోందని సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం విమర్శించారు. గురువారం సీపీఎం బృందం ఆసుపత్రిని సందర్శించి రోగులు, డాక్టర్లతో మాట్లాడింది. ప్రభుత్వం ఏడాది క్రితం ఏర్పాటు చేసిన ఈ ఆసుపత్రికి మందుల కొనుగోలుకు బడ్జెట్ కేటాయించలేదని, కనీస సౌకర్యాలు లేవని, దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నేతలు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిధులు కేటాయించి ఆసుపత్రిని అభివృద్ధి చేయాలని వీరభద్రం కోరారు.

### 100 మందికి ఉచిత కళ్లజోళ్లు పంపిణీ:

### ఎల్వీ ప్రసాద్ కంటి ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో సేవ

అశ్వారావుపేట, : ఖమ్మం జిల్లా, సత్తుపల్లిలోని తల్లాడ మండల పరిధిలోని అన్నారుగూడెం గ్రామంలో గురువారం, 100 మంది కంటి చూపు సమస్యలున్న పేదలకు ఎల్వీ ప్రసాద్ కంటి ఇన్స్టిట్యూట్, విజన్ కేంద్రాల ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. లబ్ధిదారులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయపాటి వినోద, దేవి చంద్రరావు, ఆపతి వెంకటరామారావు, రమేష్, వెంకటేశ్వర్లు, గొర్ల మోహన్ రెడ్డి, ఎం. నాగమణి తదితరులు పాల్గొన్నారు.

### వైద్యురాలు సుధారాణి అండగా ఆదివాసీ కుటుంబాలు

సత్తుపల్లి, : ఖమ్మం జిల్లా, సత్తుపల్లికి చెందిన ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ కొనకళ్ళ సుధారాణి, గురువారం గాండ్ల గూడెం సమీపంలోని రేగడ, జిల్లేడు పాక గ్రామాలలో నివాసం ఉంటున్న 52 ఆదివాసీ కుటుంబాలకు అండగా నిలిచారు. చలికాలంలో రగ్గులు కొనలేని స్థితిలో ఉన్న ఆదివాసీలకు ఆమె రగ్గులు, పిల్లలకు పోషకాహారాన్ని అందించారు. పేదరికంతో బాధపడుతున్న ఆదివాసీల కష్టాలను తెలుసుకుని ఆమె ఈ సహాయాన్ని అందించారు.

## బిర్సా ముండా జయంతి:

### గిరిజన స్వాతంత్ర సమరయోధుడికి ఘన నివాళి



జనగామ, : రాయినిగూడెం గ్రామపంచాయతీ కార్యాలయంలో జన జాతీయ గౌరవ్ దినోత్సవం సందర్భంగా శ్రీ భగవాన్ బిర్సా ముండా గిరిజన స్వాతంత్ర సమరయోధుల జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. 25 ఏళ్లకే దేశం కోసం ప్రాణత్యాగం చేసిన బిర్సా ముండాను స్మరిస్తూ, ఆయన ఆశయాలను కొనసాగించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నవంబర్ 1 నుండి 15 వరకు దేశవ్యాప్తంగా బిర్సా ముండా జయంతి ఉత్సవాలు జరుపుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు.

## విపత్తులను గుర్తిస్తాయి

భూపాలపల్లి, : నిట్ సివిల్ ఇంజినీరింగ్ విభాగం, ఇండియన్ జియోటెక్నికల్ సొసైటీ (ఐజీఎస్) వరంగల్ సంయుక్తంగా 'నేల మనకు ఏమి చెప్పడానికి ప్రయత్నిస్తుంది.. ముందస్తు హెచ్చరిక, భూ పదార్థ అస్థిరతను అర్థం చేసుకోవడానికి శబ్ద మార్గాలు' అనే అంశంపై నిట్‌లో నిపుణుల ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ఐఐటీ ఢిల్లీలో సివిల్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీరింగ్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్, హనుమకొండ నివాసి డాక్టర్ వంగల ప్రశాంత్ ప్రధాన వక్తగా పాల్గొని మాట్లాడారు. భూమి, కొండచరియలు నేలమట్టం కావడానికి ముందే సూక్ష్మ శబ్ద సంకేతాల ద్వారా ఈ ప్రమాదాలను ముందుగా గుర్తించడం ఎలా సాధ్యమవుతుందనే విషయాలను వివరించారు. ఐఐటీ ఢిల్లీలో తమ బృందం అకస్టిక్ ఆధారిత సెన్సార్లను అభివృద్ధి చేస్తోందని తెలిపారు. ఇవి భూగర్భంలో జరుగుతున్న సూక్ష్మ మార్పులను ముందస్తుగా గుర్తించి ప్రారంభ హెచ్చరికలు జారీ చేస్తాయన్నారు.

## గంజాయి విక్రయదారులపై కేసు

మహబూబాబాద్, : మహబూబాబాద్ పట్టణంలో గంజాయిని విక్రయిస్తున్న నలుగురు యువకులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ గట్ల మహేందర్‌రెడ్డి తెలిపారు. మహబూబాబాద్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో నిందితులను అరెస్టు చూపి వివరాలను వెల్లడించారు. పట్టణంలో గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు పట్టణ ఎస్సై టి.అశోక్ సిబ్బందితో తనిఖీలు నిర్వహిస్తుండగా నలుగురు యువకులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించి అరెస్టు చేశారు. అరెస్టైన వారిలో ఖమ్మం జిల్లా కోయచెలక గ్రామానికి చెందిన మండల సంతోష్‌కుమార్, మహబూబాబాద్ కంకరబోడ్ కాలనీకి చెందిన షేక్ షకీల్, గూడూరు మండలం కొల్లాపూర్ గ్రామ పరిధిలోని గండితండాకు చెందిన గుగులోతు అనిల్, మహబూబాబాద్ పట్టణంలోని మార్కండేయ ఆలయ కాలనీకి చెందిన ఇస్లావత్ సాయిగణేష్ ఉన్నారు. వీరు ఇతర జిల్లాల నుంచి తక్కువ ధరకు గంజాయి తీసుకొచ్చి మహబూబాబాద్ పరిసర ప్రాంతాల్లో ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నట్లు సీఐ తెలిపారు.

## గుండెపోటుతో హమాలీ మృతి

డోర్నకల్, : జనగామ జిల్లా రఘునాథపల్లి మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఓ హమాలీ కార్మికుడు గుండెపోటుతో మృతి చెందాడు. హమాలీ కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్మెట్ట మండలం మచ్చుపాహడ్‌కు చెందిన మామిడాల ఆగయ్య(55) గత కొంత కాలంగా స్థానికంగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో హమాలీగా చేస్తున్నారు. సహచర కూలీలతో కలిసి లారీలో బస్తాలు లోడ్ చేస్తుండగా.. ఒక్కసారిగా కుప్పకూలారు. పక్కనే ఉన్న రైతు సీపీఆర్ చేసి కారులో సమీపంలో పీహెచ్‌సీకి తరలించారు.

## రైతులకు ఇబ్బంది లేకుండా చూడండి:

సంగారెడ్డి, : సంగారెడ్డిలో గురువారం ఎమ్మెల్యే చింత ప్రభాకర్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను కోరారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గన్ని బ్యాగులు అందుబాటులో ఉంచాలని, ధాన్యం చివరి వరకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

### కలెక్టర్ కార్యాలయం ముందు బీసీ చేసి ధర్మ దీక్ష

ఆందోల్, : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ బీసీ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్మదీక్ష నిర్వహించారు. బీసీలకు రిజర్వేషన్లు సాధించేవరకు తమ ఆందోళన కొనసాగుతుందని జిల్లా చైర్మన్ ప్రభు గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

### బీసీలకు 42% రిజర్వేషన్లు:

### వెంటనే అమలు చేయాలని ధర్మపోరాట దీక్ష



నారాయణఖేడ్, : హుస్నాబాద్ పట్టణ అక్కన్నపేట చౌరస్తాలో బీసీ సంఘాలు, రాష్ట్ర బీసీ నాయకత్వం పిలుపు మేరకు 42% రిజర్వేషన్ల బిల్లును వెంటనే అమలు చేయాలని ధర్మపోరాట దీక్ష చేపట్టారు. వచ్చే శీతాకాల సమావేశాల్లో బీజేపీ ప్రభుత్వం చట్టసభల్లో, విద్య, ఉద్యోగ రంగాల్లో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ట్రాక్టర్

పటాన్‌చెరు, : ధాన్యం లోడుతో వస్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి స్తంభాన్ని ఢీకొట్టిన ఘటన హుస్నాబాద్ మండలం తోటపల్లి స్టేజీ వద్ద చోటుచేసుకుంది. దీనితో విద్యుత్ స్తంభం విరిగి ట్రాక్టర్ పై పడింది. ఈ ఘటనలో ట్రాక్టర్ లోని ధాన్యం బస్తాలు కింద పడిపోయాయి. ప్రమాదం జరిగిన సమయంలో ఎవరూ రాకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. ఈ విషయం తెలుసుకున్న విద్యుత్ సిబ్బంది వెంటనే అక్కడికి వెళ్లి మరమ్మతు పనులు చేపట్టారు.

## చెట్టును ఢీకొట్టిన కారు..

### ఇద్దరు మృతి, మరో ఇద్దరికి గాయాలు

పాలకుర్తి, : చెట్టును కారు ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు మృతి చెందగా.. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం కొత్తగట్టు శివారులో అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం రేపాక పల్లికి చెందిన పార్శ సంపత్, హనుమకొండ జిల్లా పరకాల మండలానికి చెందిన బొంపల్లి కిషన్, వెంకటేశ్ , ఆత్మకూరుకు చెందిన చింతపట్ల మురళీకృష్ణలు కలిసి కారులో పరకాల నుంచి హనుమకొండ వైపు వెళ్తున్నారు. అర్ధరాత్రి సమయంలో కొత్తగట్టు శివారులో కారు అతివేగంగా వెళ్తూ రహదారి పక్కనున్న చెట్టును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పార్శ సంపత్, బొంపల్లి కిషన్ అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్ర గాయాలపాలైన మురళీకృష్ణ, వెంకటేష్‌లను వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి, మృతదేహాలను మార్చురీకి తరలించారు. సంఘటనా స్థలంలో సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

## సన్నబియ్యం బరువు తగ్గింది!

స్టేషన్‌ఘన్‌పూర్, : 'ఇంటి దొంగను ఈశ్వరుడైనా పట్టలేరనే' సామెత పౌర సరఫరాలశాఖకు నప్పుతుంది. రేషన్ లబ్ధిదారులకు ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేస్తోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో సన్నబియ్యం బస్తా బరువు తగ్గిపోతోంది. నిఘా వైఫల్యంతో 'సరఫరాలో కోత' వల్లే ఈ పరిస్థితి నెలకొంటోంది. అక్రమం వేళ్లూనుకుంటోంది. ఈ దోపిడీని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టింపులేదనే ఆరోపణలున్నాయి. నిర్దిష్టమైన కోటాకు తక్కువగా బియ్యం వస్తుండటంతో కొందరు డీలర్లు చేతివాటం చూపుతున్నారు. అటు అధికారులు, ఇటు రేషన్ డీలర్ల తీరుతో లబ్ధిదారులు నష్టపోతున్నారు.

# సనత్‌నగర్ ఈఎస్ఐ హాస్పిటల్‌లో సర్వర్ స్టక్

## గంటల తరబడి రోగుల నిరీక్షణ

- ఉదయం నుంచి పనిచేయని సర్వర్లు
- అవుట్‌పేషెంట్లకు తీవ్ర ఇబ్బందులు
- ప్రభుత్వ శాఖలో నిత్యం సర్వార్ల సమస్యలు
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేయడంలో అధికారులు పూర్తిగా విఫలం

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ప్రభుత్వ శాఖలలో సర్వర్ల కష్టాలు అంతా ఇంతా కాదు ఎప్పుడు ఏదో ఒక సమస్య ఉత్పన్నమై ప్రజలను ఇబ్బందులు పెట్టడం సర్వసాధారణంగా మారింది. అధికారులతో కానీ ఉద్యోగులతో కానీ ఏమైంది సార్ మా పని ఇంకా కాలేదు అంటే సర్వర్ రావడం లేదు, సర్వర్ స్లో, సిస్టం సమస్య అంటూ ఏదో ఒకటి చెబుతూ ఉంటారు. సర్వర్ల కోసం ప్రభుత్వం కోట్లు ఖర్చు పెడుతున్న మరి నిర్వహణ ఎందుకు సక్రమంగా ఉండడం లేదో వాళ్లకే తెలియాలి. సనత్‌నగర్ ఈఎస్ఐ ఆస్పత్రిలో సర్వర్లు గురువారం ఉదయం నుంచి పనిచేయకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు ప్రతి రోజు పెద్ద సంఖ్యలో వచ్చే అవుట్‌పేషెంట్లు తమ ఓపి టోకెన్ల కోసం గంటల తరబడి క్యూలలో నిల్చోక తప్పని పరిస్థితి ఏర్పడింది. డిజిటల్ విధానాలపై ఆధారపడుతూ, బుకింగ్ ప్రక్రియను పూర్తిగా ఆన్లైన్‌పై పెట్టిన ఈఎస్ఐ పరిపాలన, సర్వర్ డౌన్‌తో పూర్తిగా కుదేలైంది.

### ఓపి టోకెన్ కోసం తప్పని తిప్పలు..

ఉదయం 8 గంటల నుంచే రోగులు ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. కానీ సిస్టమ్ పనిచేయకపోవడంతో ఓపి బుక్ చేసుకునే అవకాశం లేకపోయింది."సర్వర్ పనిచేయడం లేదు, కాసేపు వేచి ఉండండి" అని చెప్పడంతో వందలాది మంది రోగులు నిరాశతో వేచి చూడాల్సి వచ్చింది. కొంతమంది వృద్ధులు కూర్చోడానికి కూడా స్థలమేలేదని చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

### "యాప్ ద్వారా బుక్ చేసుకోండి" అంటూ చేతులెత్తిన సిబ్బంది

సిస్టమ్ పనిచేయడం లేదన్న కారణంగా, "ఫోన్లో ఈఎస్ఐ యాప్ డౌన్‌లోడ్ చేసుకొని ఓపి బుక్ చేసుకోండి" అంటూ సిబ్బంది రోగులను మొబైల్ వైపు మళ్లించారు.కానీ చాలామంది కార్మికులకు ఆండ్రాయిడ్ యాప్ ఎలా ఉపయోగించాలో, ఏ ఆప్షన్‌ను ఎంచుకోవాలో తెలియక మరింత ఇబ్బందులు ఏర్పడ్డాయి. కొన్ని ఫోన్లలో యాప్ ఓపెన్ అయినా, సర్వర్ సమస్య కారణంగా అందులో కూడా బుకింగ్ పూర్తవకపోవడంతో రోగులు తీవ్ర అసహనానికి గురయ్యారు.

### సర్వర్ మొరాయింపు- ఓపి పేపర్ దొరకక పోవడం

ఓపి పేపర్ లేకపోతే డాక్టర్లను కలవడానికి అవకాశం లేదు.
కానీ సర్వర్ పూర్తిగా డౌన్ కావడంతో రోగులకు పేపర్లు జారీ చేయలేకపోయారు.ఒక రోగి మాట్లాడుతూ "ఉదయం 9 గంటలకు వచ్చాం%ాా% ఇప్పటికీ టోకెన్ రాలేదు. డాక్టర్‌ను ఎప్పుడు చూపించాలో కూడా తెలియడం లేదు" అని ఆవేదన వ్యక్తం చేశారు.

### వందలాది మంది రోగుల నిరీక్షణ

మధ్యాహ్నం వరకూ సమస్య పరిష్కారం కానందున, ఆస్పత్రి లాబీలో రోగులు, వారి కుటుంబ సభ్యులు గుంపులుగా నిలుచుని కనిపించారు. కొందరు పిల్లలతో, కొందరు వృద్ధులతో గంటల తరబడి వేచి ఉండాల్సి రావడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు.కొందరు ఉద్యోగులు మాట్లాడుతూ "రోజూ పని నుండి సెలవు తీసుకుని ఆస్పత్రికి వస్తున్నాం.
కానీ ఒక టోకెన్ కూడా టైంలో రాదేంటీ.?" అని ప్రశ్నించారు. సర్వర్ లేకుంటే వెంటనే ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేయడంలో ప్రభుత్వ ఆసుపత్రి అధికారులు పూర్తిగా విఫలం చెందుతున్నారు.





### నిర్వాహకుల నిర్లక్ష్యం.?

డిజిటల్ బుకింగ్ సిస్టమ్‌కి సంబంధించి ఇప్పటి వరకూ ఇలాంటి సమస్యలు పదేపదే వస్తున్నాయని రోగులు చెబుతున్నారు. ఎప్పటికప్పుడు సర్వర్ పనిచేయకపోవడం, నెట్‌వర్క్ లోపాలు రావడం, యాప్ పనిచేయకపోవడం వంటి అంశాలు అధికారుల నిర్లక్ష్యాన్ని బట్టబయలు చేస్తున్నాయని ఆరోపిస్తున్నారు.ఆస్పత్రి నిర్వహణ అధికారులు స్పందించాలన్నా, సమస్య పరిష్కారానికి ప్రయత్నించాలన్నా పెద్దగా కదలికలు కనిపించకపోవడం రోగుల్లో మరింత అసహనానికి దారితీస్తోంది. ఇప్పటికైనా అధికారులు సర్వర్ రాణి సమయంలో రోగులను ఇబ్బంది పెట్టకుండా వెంటనే ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధంగా ఉంచుకోవాలని దీనిపై ఆరోగ్యశాఖ మంత్రి కఠినంగా వ్యవహరించాలని రోగులు వారి బంధువులు కోరుతున్నారు.

# జిహెచ్ఎంసి కే జరిమానా

## - రూ.1 లక్ష జరిమానా విధించిన ఎన్జీటీ




చెత్త నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా జీహెచ్ఎంసీకి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) రూ.1 లక్ష జరిమానా విధించింది. నగరంలో ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను నియమాలను పట్టించుకోకుండా జవహర్‌నగర్‌లో డంప్ చేస్తున్నారని పలువురు ఫిర్యాదు చేయడంతో ఎన్జీటీ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రజలు, వ్యాపారులు చెత్త వేస్తే జరిమానాలు వేస్తున్న జీహెచ్ఎంసీకి ఇప్పుడు తానే జరిమానా పడింది. చెత్త, వ్యర్థాల నిర్వహణలో క్రమబద్ధత పాటించి, పర్యావరణానికి హాని కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎన్జీటీ ఆదేశాలు జారీ చేసింది.

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ నగరంలో వ్యర్థాల యాజమాన్యంలో సరైన పద్ధతులను పాటించడంలో విఫలమైనందుకు గాను, జాతీయ హరిత ట్రైబ్యునల్ (నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్) జీహెచ్ఎంసీ (బల్దియా)కు లక్ష రూపాయల జరిమానా విధించింది. చెత్త నిర్వహణలో ప్రజలకు జరిమానాలు విధిస్తున్న జీహెచ్ఎంసీకే జరిమానా పడటం గమనార్హం. ఈ వ్యవహారం వెనుక ప్రధాన కారణం జవహర్‌నగర్ డంపింగ్ యార్డు. నగరంలో ఉత్పత్తయ్యే లక్షలాది టన్నుల చెత్తను సక్రమంగా నిర్వహించకుండా, ఇష్టానుసారంగా జవహర్‌నగర్‌లో డంపింగ్ చేస్తున్నారంటూ ఆ ప్రాంత ప్రజలు ఎన్జీటీని ఆశ్రయించారు. దీంతో చెత్త డంపింగ్ వల్ల తమ ఆరోగ్యం, పర్యావరణం దెబ్బతింటున్నాయని వారు ఫిర్యాదు చేశారు. ప్రజల ఫిర్యాదుల మేరకు ఇటీవల విచారణ జరిపిన ఎన్జీటీ(ఎన్జీటీ) జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు చెత్త తరలింపును వెంటనే నిలిపివేయాలని తీర్పు ఇచ్చింది. అయితే దేశంలోనే అతిపెద్ద నగరాల్లో ఒకటైన హైదరాబాద్‌లో చెత్త తరలింపు ఆగిపోతే, నగరంలో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయి గందరగోళ పరిస్థితులు, ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని జీహెచ్ఎంసీ అధికారులు ఎన్జీటీకి విన్నవించుకున్నారు.

### మరోసారి క్యాపింగ్..

దీంతో బుధవారం విచారణ సందర్భంగా బల్దియాకు తాత్కాలిక ఉపశమనం లభించింది. చెత్త తరలింపును కొనసాగించడానికి ఎన్జీటీ అనుమతి ఇచ్చింది. అయితే ఇష్టానుసారంగా చెత్త పోయడం కాకుండా, యార్డులో మరోసారి 'క్యాపింగ్' (చెత్తను కప్పివేసి, శాస్త్రీయంగా మూసివేసే ప్రక్రియ) చేయాలని, వ్యర్థాల నిర్వహణకు అత్యంత పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఎన్జీటీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ముఖ్యంగా, 'వేస్ట్ టు ఎనర్జీ' ప్రాజెక్టుల ద్వారా చెత్తను విద్యుత్తుగా మార్చే ప్రక్రియను వేగవంతం చేయాలని, పొడి చెత్త, తడి చెత్త వేర్వేరుగా సేకరించే ప్రక్రియను మరింత మెరుగుపరచాలని సూచించింది. ఎన్జీటీ తాజా సూచనలతో జీహెచ్ఎంసీ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. నగరంలో ప్రతిరోజూ ఉత్పత్తి అయ్యే వేలాది టన్నుల చెత్తను శాస్త్రీయంగా నిర్వహించడం ఒక సవాలుగా మారుతున్నందున భవిష్యత్తులో వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను మెరుగుపరచడానికి చర్యలు తీసుకోవాలని అధికారులు భావిస్తున్నారు.

### పర్యావరణ సమస్యల పరిష్కారం..

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రోజుకు 6,500 టన్నులకు పైగా చెత్త ఉత్పత్తి అవుతోంది. పెరుగుతున్న నగర జనాభా, వ్యర్థాల పెరుగుదల నేపథ్యంలో ఈ నిర్వహణ జీహెచ్ఎంసీకి ప్రధాన సవాలుగా మారింది. జరిమానాను పాఠంగా తీసుకుని భవిష్యత్తులో పర్యావరణ నిబంధనలను కచ్చితంగా పాటించడానికి ప్రజా ఆరోగ్యాన్ని కాపాడటానికి బల్దియా అధికారులు కొత్త ప్రణాళికలను సిద్ధం చేయాలని భావిస్తున్నారు. ఈ ఎన్జీటీ తీర్పు హైదరాబాద్‌లో పర్యావరణ సమస్యల పరిష్కారం పట్ల మరింత జవాబుదారీతనం అవసరాన్ని చెబుతోంది.

# అరెస్టుకు ముందే కారణాలు చెప్పాల్సిందే

## - సుప్రీం కోర్టు సంచలన తీర్పు

## - ఎలాంటి నేరం కింద అరెస్టు చేసిన తెలపాలి

**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** అరెస్టు అయిన నిందితుల రాజ్యాంగ హక్కులను పరిరక్షించే దిశగా దేశ సర్వోన్నత న్యాయస్థానం సంచలనాత్మక తీర్పును వెలువరించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం ఎలాంటి నేరం కింద అరెస్టు చేసినా సరే, ఎలాంటి మినహాయింపులు లేకుండా అరెస్టుకు గల కారణాలను లిఖితపూర్వకంగా, నిందితుడికి అర్థమయ్యే భాషలోనే తెలియజేయాలని స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని అధికరణం 22(1) ప్రకారం, అరెస్టు చేసిన వ్యక్తికి అరెస్టు కారణాలు సాధ్యమైనంత త్వరగా తెలియజేయాలనే అంశాన్ని ఈ తీర్పు బలంగా సమర్థించింది. జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్ 52 పేజీల తీర్పులో "ఇది ఏదో లాంఛనప్రాయంగా పాటించాల్సిన విధానం కాదు. ఇది పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛకు రాజ్యాంగం హామీ ఇచ్చిన ప్రాథమిక రక్షణ" అని స్పష్టం చేశారు. ముఖ్యంగా తనను ఎందుకు అరెస్టు చేశారో, తనపై మోపిన నేరారోపణల స్వభావం ఏమిటో నిందితుడికి తెలియాల్సిన అవసరం ఉందని ధర్మాసనం పేర్కొంది. ఈ జ్ఞానం మాత్రమే నిందితుడు న్యాయ సహాయం కోసం ప్రయత్నించడానికి, తనపై వచ్చిన ఆరోపణలకు తగిన విధంగా ప్రతిస్పందించడానికి వీలు కల్పిస్తుంది.



### రిమాండ్‌కు 2 గంటల ముందు గడువు

సాధారణంగా అరెస్టు సమయంలోనే లిఖితపూర్వక కారణాలు ఇవ్వడం తప్పనిసరి. అయితే ప్రత్యేక పరిస్థితుల కారణంగా అరెస్టు సమయంలో కారణాలు తెలియజేయడం సాధ్యం కాకపోతే.. వాటిని రిమాండ్ కోసం న్యాయమూర్తి ఎదుట నిందితుడిని హాజరు పరచడానికి కనీసం రెండు గంటల ముందుగానైనా లిఖిత పూర్వకంగా అందజేయాలని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఈ గడువును పాటించడంలో విఫలం అయితే ఆ అరెస్టును, నిందితుడి రిమాండ్‌ను చట్టవిరుద్ధ చర్యగా పరిగణించే అవకాశం ఉంటుందని పేర్కొంది. ఈ తీర్పు ముంబయిలో 2024లో జరిగిన బీఎండబ్ల్యూ హిట్ అండ్ రన్ కేసులో నిందితుడు మిహిర్ రాజేశ్ షా దాఖలు చేసిన అప్పీలుపై వెలువడింది. తన అరెస్టుకు గల కారణాలను రాతపూర్వకంగా ఇవ్వలేదనే కారణంపై షా తన అరెస్టు చట్టబద్ధతను సవాలు చేశారు. సుప్రీం కోర్టు ఇచ్చిన ఈ చారిత్రక తీర్పు అమలు కోసం, దీని ప్రతులను అన్ని హైకోర్టుల రిజిస్ట్రార్ జనరళ్లకు, అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు పంపించాలని సుప్రీం కోర్టు రిజిస్ట్రీని ధర్మాసనం ఆదేశించింది.

# పుణేలో కంటైనర్లు ఢీకొని భారీగా మంటలు

## - మధ్యలో చిక్కుకుపోయిన కారు, 8 మంది మృతి



పూణే (ప్రశ్న న్యూస్) పుణే-బెంగళూరు జాతీయ రహదారిపై నవలే వంతెన సమీపంలో గురువారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మంది దుర్మరణం చెందగా, 20 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. రెండు కంటైనర్ లారీలు ఒకదానికొకటి ఢీకొనడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఆ సమయంలో కంటైనర్ల మధ్యలో కారు చిక్కుకుపోవడంతో అందులో ప్రయాణిస్తున్న వారంతా సజీవదహనమయ్యారు. క్షతగాత్రులను వెంటనే సమీపంలోని ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసు బృందాలు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. అగ్నిమాపక యంత్రాల ద్వారా మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఒక కంటైనర్ అతి వేగంగా వచ్చి పలు వాహనాలను ఢీకొంటూ ముందుకు దూసుకెళ్లి మరో కంటైనర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మంటలు వ్యాపించాయని, అదే సమయంలో వాటి మధ్యలో చిక్కుకున్న కారు కూడా మంటల్లో కాలిపోయిందని పోలీసులు తెలిపారు. మృతులను గుర్తించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వెల్లడించారు. "సతారా నుంచి ముంబై వైపు వెళుతున్న ఒక కంటైనర్ ట్రక్ బ్రేక్ ఫెయిల్ అవ్వడం వల్ల అదుపు తప్పిందని తెలిసింది. ఆ ట్రక్ ఏడు నుంచి ఎనిమిది వాహనాలను ఢీకొట్టింది. చివరకి మరో పెద్ద కంటైనర్ ట్రక్కును బలంగా ఢీకొంది. ఒక కారు వాటి మధ్యలో చిక్కుకుని నుజ్జునుజ్జు అయింది, మంటల్లో కాలిపోయింది" అని సంఘటనా స్థలానికి చేరుకున్న ఒక పోలీసు అధికారి తెలిపారు. అతివేగం, బ్రేక్ ఫెయిల్ కావడమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని ప్రాథమికంగా నిర్ధారించామని ఆయన పేర్కొన్నారు.

# వేగమే వేదంగా పనిచేస్తున్నాం

## - విశాఖ పెట్టుబడుల సదస్సుకు ముందే భారీగా ఒప్పందాలు



**విశాఖపట్నం (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించడంలో కూటమి ప్రభుత్వం సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. విశాఖలో పెట్టుబడుల భాగస్వామ్య సదస్సు ప్రారంభం కావడానికి ఒక రోజు ముందే రాష్ట్రానికి పెట్టుబడుల వరద పారింది. ఈ క్రమంలో గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు ముఖ్యమంత్రి చంద్రబాబు 15కు పైగా సమావేశాల్లో పాల్గొని, సుడిగాలి పర్యటన చేశారు. తైవాన్, ఇటలీ రాయబారులతో పాటు పలు జాతీయ, అంతర్జాతీయ కంపెనీల ప్రతినిధులతో వరుస భేటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "పెట్టుబడుల సదస్సుకు ముందే ఈ స్థాయిలో స్పందన రావడం సంతోషకరం. పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన ప్రతి పారిశ్రామికవేత్తకు ధన్యవాదాలు. రాష్ట్రాన్ని పెట్టుబడుల్లో నంబర్ 1 స్థానంలో నిలపడమే మా ధ్యేయం. వేగమే వేదంగా పనిచేస్తున్నాం" అని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న అవకాశాలను వివరిస్తూ, "ఏపీకి వెయ్యి కిలోమీటర్ల సుదీర్ఘ తీరప్రాంతం, పోర్టులు, మెరుగైన రోడ్డు, రైలు కనెక్టివిటీ ఉన్నాయి. దీంతో ఏపీ లాజిస్టిక్స్ రంగానికి కేంద్రంగా మారుతుంది. గ్రీన్ ఎనర్జీ, హార్టికల్చర్, ఆక్వా కల్చర్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో అపార అవకాశాలున్నాయి. ఆలోచనలతో వచ్చేవారికి అన్ని విధాలా అండగా ఉంటాం. 'ఒక కుటుంబం-ఒక వ్యాపారవేత్త' నినాదంతో ముందుకెళుతున్నాం. 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానంతో అనుమతుల్లో ఎలాంటి జాప్యం ఉండదు" అని చంద్రబాబు పారిశ్రామికవేత్తలకు భరోసా ఇచ్చారు.

### గత ప్రభుత్వంలో వెళ్లిన కంపెనీలు వెనక్కి

గత ప్రభుత్వ విధానాలు నచ్చక రాష్ట్రం విడిచి వెళ్లిన రెన్యూ పవర్ వంటి పలు ప్రముఖ సంస్థలు తిరిగి ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడం విశేషం. కూటమి ప్రభుత్వం కల్పిస్తున్న పారిశ్రామిక అనుకూల వాతావరణానికి ఇది నిదర్శనమని విశ్లేషకులు భావిస్తున్నారు. రెండు రోజుల సదస్సులో మొత్తం రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని ప్రభుత్వం అంచనా వేస్తుండగా, తొలిరోజే మూడో వంతుకు పైగా లక్ష్యం నెరవేరడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఇదే కార్యక్రమంలో, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ల కోసం బాలాజీ యాక్షన్ బిల్డ్‌వేర్ సంస్థ రూ.1 కోటి విరాళం చెక్కును ముఖ్యమంత్రికి అందజేసింది.

# బండి సంజయ్ బాటలోనే కిషన్ రెడ్డి

## - కీలక నిర్ణయం ప్రకటించిన కేంద్ర మంత్రి




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కేంద్ర మంత్రి, బీజేపీ సీనియర్ నాయకుడు కిషన్ రెడ్డి ఒక ముఖ్యమైన ప్రకటన చేశారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ బాటలో ఆయన కూడా విద్యార్థుల ఫీజులు చెల్లించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులందరి పరీక్ష ఫీజులను తన వ్యక్తిగత వేతనం నుంచి చెల్లిస్తానని ఆయన స్పష్టం చేశారు. పేద విద్యార్థుల విద్యకు ఆర్థికపరమైన ఇబ్బందులు తలెత్తకూడదనే ఉద్దేశంతో, అంత్యోదయ స్ఫూర్తితో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ విషయమై ఆయన హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌కు ఒక లేఖ రాశారు. నియోజకవర్గంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులెందరు ఉన్నారో, ఎంత మొత్తం అవసరమో తెలియజేయాలని ఆయన కలెక్టర్‌ను కోరారు. వారం రోజుల క్రితం కేంద్ర సహాయ మంత్రి, బీజేపీ ఎంపీ బండి సంజయ్ కూడా తన నియోజకవర్గంలోని పదో తరగతి విద్యార్థుల పరీక్ష ఫీజును తానే చెల్లిస్తానని ప్రకటించిన విషయం విదితమే. ఈ మేరకు ఆయన సంబంధిత జిల్లాల కలెక్టర్లకు లేఖలు రాశారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588